# ఆత్మ పరిణామ క్రమం

రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి



# ఆత్మ పరిణామక్రమం



రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

మొదటి ముద్రణ : జూన్, 2026
ప్రతులు : 1,000

వెల : రూ. 70/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్ధం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 12) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 13) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 14) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 15) పంచకోశాలు | - | రూ.60/- |
| 16) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 20) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 21) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 22) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 23) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# ఆత్మ పరిణామక్రమం

ఈ లోకంలో జంతు జన్మల వరకు జ్ఞానం పొందే అర్హత లేదు, కర్మ సిద్ధాంతం లేదు. మానవ జన్మలోకి వచ్చాకే కర్మ సిద్ధాంతం ఉంటుంది, మోక్షం పొందే అర్హత కూడా ఉంటుంది.

ఇక్కడ చూసుకుంటే మొదట కొన్ని జన్మలు అజ్ఞానంతో గడుస్తాయి, కొన్ని జన్మలు అహంకారంతో గడుస్తాయి, ఇంకా చిట్ట చివరి జన్మలు ఆత్మ జ్ఞానం, బ్రహ్మ జ్ఞానం పొంది మోక్ష స్థితిలో ఉంటాయి.

మరి ఈ విధంగా ఎందుకు ఉంటున్నారు, దానికి కారణం ఏంటి అనేది మీరు తెలుసుకోవాలి. మీరు ఈ మూడు రకాలుగా అర్థం చేసుకోవాలి, ఎందుకంటే అజ్ఞానం నుంచి ఆత్మజ్ఞానం పొంది మోక్ష స్థితిలోకి వెళ్లడం అనేది చిట్ట చివరి స్థితి.

ఆత్మలు భూమి పైకి వచ్చిన తరువాత ఏడు స్థితుల్లో ఉంటాయి. 1) శైశవాత్మ దశ, 2) బాలాత్మ దశ, 3) యువాత్మ దశ, 4) ప్రౌఢాత్మ దశ, 5) వృద్ధాత్మ దశ, 6) విముక్తాత్మ దశ, 7) పూర్ణాత్మ దశ. ఇవన్నీ అజ్ఞానం నుంచి ఆత్మజ్ఞానం వరకు ఎదుగుదలను సూచిస్తాయి.

**1) శైశవాత్మ:** శైశవాత్మ దశ అంటే పుట్టిన వెంటనే ఉండే స్థితి, అంటే చిన్న పిల్లల స్థితి. ఈ శైశవాత్మ దశలో ఆత్మ పూర్తిగా అజ్ఞానంతోనే ఉంటుంది. అంటే నాస్తికత్వం లేదు, ఆస్తికత్వం కూడా ఉండదు. దేవుడు ఉన్నాడో లేదో తెలియని అయోమయ స్థితిలో ఉంటారు.

వీరి పరిస్థితి ఏమిటి అంటే? జంతు జన్మల్లో ఏ పని చేశారో అదే విధంగా జీవిస్తారు. అంటే తినడం, తిరగడం, పడుకోవడం ఇలా సాధారణ జీవితానికే పరిమితం అవుతారు. మీ చుట్టూ గమనిస్తే ఇలాంటి వాళ్లు కనిపిస్తారు. వీరు శరీర స్థితిలోనే ఉంటారు, శరీర పోషణ గురించే ఆలోచిస్తారు. శరీరం, మనసు ఈ రెండింటి కోసమే జీవిస్తూ ఉంటారు. కానీ వీటన్నిటినీ

నడిపిస్తున్నది ఆత్మ అనే విషయం వీరికి అక్కర్లేదు, తెలుసుకోరు కూడా. ఒకవేళ మీరు ఏమైనా చెప్తే "ఆ గొడవ నాకు ఎందుకు, ఈ భూమిమీద ఉన్నన్నాళ్లు సుఖంగా బ్రతికామా? లేదా? హాయిగా బ్రతికామా? లేదా? ఇలా ఉంటే చాలు" అని అనుకుంటారు. ఇది అజ్ఞాన దశ. ఇలా శైశవాత్మ దశలో ఉన్న ఆత్మ కొంచెం ఎదిగాక బాలాత్మ దశలోకి వస్తుంది.

**2) బాలాత్మ దశ:** ఈ బాలాత్మ దశలో తల్లిదండ్రులను బట్టి పిల్లల మనస్తత్వం ఉంటుంది. అక్కడ తల్లిదండ్రులు ఏ మతానికి చెందినవారో, ఆ మతానికి సంబంధించిన ఆచారాలు, సంప్రదాయాలు పాటిస్తారు. అంటే తల్లిదండ్రులు క్రిస్టియన్ అయితే చర్చికి వెళ్తారు, ముస్లింలు అయితే మసీదుకి వెళ్తారు, హిందువులు అయితే గుడికి వెళ్తారు. ఆయా దేవుళ్లను పూజిస్తారు.

కానీ ఇక్కడ పిల్లలకు అంతకంటే లోతైన అవగాహన ఉండదు. శైశవాత్మ దశ నుంచి బాలాత్మ దశలోకి వచ్చినా కూడా తల్లిదండ్రులు, పరిసరాలు, పుట్టిన కులం, మతం బట్టే వారి ప్రవర్తన ఉంటుంది. ఇక్కడ అంతకంటే ఎక్కువ ఆలోచన ఉండదు. ఎవరెవరు ఏ మతంలో పుట్టారో, ఆ మతంలో ఉన్న దేవుళ్ళను తమ దేవుడిగా భావించి, ఆ విగ్రహాలను పూజిస్తూ, ప్రార్థిస్తూ జీవితాన్ని గడిపేస్తారు. కానీ అంతకంటే లోతుగా ఆలోచించరు, ఎందుకంటే వారికి తెలియదు. ఇదే బాలాత్మ దశ.

శైశవాత్మ దశలో, బాలాత్మ దశలో అజ్ఞానమే ఉంటుంది. అజ్ఞానం అంటే సత్యజ్ఞానం తెలియక భ్రమలో ఉండడం, సత్యం కాని దాన్ని సత్యం అనుకోవడమే అజ్ఞానం. ఈ అజ్ఞానం ఉన్నప్పుడు వారు అంతకంటే ఎక్కువగా ఏమి చేయరు. ఇక కొన్ని జన్మలు గడిచిన తర్వాత, ప్రాపంచిక జీవితంలో కొంత ఎదిగిన తర్వాత అప్పుడు వారు యువాత్మ దశలోకి వస్తారు.

**3) యువాత్మ దశ:** ఈ యువాత్మ దశలో తల్లిదండ్రులు చెప్పిన దాని ప్రకారం దేవుడిపై భక్తి పెంచుకుంటారు. ఆ భక్తి పెరిగినప్పుడు తీవ్రంగా పూజలు, ఆచారాలు పాటిస్తారు. అంటే గుడులు కట్టడం, మసీదులు కట్టడం, చర్చిలు

కట్టడం వంటి పనులు చేస్తారు. "పూజ చేసినందుకే నేను పరీక్షలో పాస్ అయ్యాను", "నాకు డబ్బు వచ్చింది", "నాకు ఈ పదవి వచ్చింది, అన్నీ భగవంతుని దయ వల్లే" అని నమ్ముతారు. ఆ స్థితిలో వారికి తెలిసింది పూజ మాత్రమే కాబట్టి, విపరీతమైన భక్తిని పెంచుకుంటారు.

కానీ దాని తోడుకు విపరీతమైన అహంకారం కూడా వస్తుంది. ఎందుకు అంటే "దేవుడి వల్లే ఇది వచ్చింది, మాకు భక్తి ఎక్కువ, కాబట్టి దేవుడికి మా మీద కనికరం ఉంది" అనే అహంకారం వస్తుంది.

అందుకే చూడండి, వశిష్ఠుల వారు చెప్తారు రూప మదం, ధన మదం, విద్య మదం ఈ మూడు మదాలు వదిలేయడం చాలా కష్టం. ఈ మూడింటి వల్లే అహంకారం పెరుగుతుంది అన్నారు. అందంగా ఉన్నా అహంకారమే, డబ్బు ఉన్నా అహంకారమే, చదువు ఉన్నా అహంకారమే.

ఇక్కడ అహంకారం పెంచుకుంటారు. కానీ ఇక్కడ కూడా ఆత్మజ్ఞానం పొందరు, పొందలేరు కూడా. అహంకారం ఉన్నప్పుడు ఆత్మజ్ఞానం వైపు దృష్టి వెళ్లదు. ఇక కొన్ని జన్మలు గడుస్తాయి. ఎంత డబ్బు ఉన్నా, ఎన్ని పదవులు ఉన్నా, ఎంత కీర్తి ప్రతిష్టలు ఉన్నా, ఎంత అందం ఉన్నా, ఒక్కొక్కసారి వారి జీవితంలో దుఃఖమే ఉంటుంది.

ఆ దుఃఖం వచ్చినప్పుడు "నాకు అన్నీ ఉన్నాయి, కానీ లోపల శాంతి ఎందుకు లేదు?" అని అన్వేషించడం మొదలుపెడతాడు. ఈ అన్వేషణలో "నేను సంపాదించాను, పదవులు వచ్చాయి, విజయం వచ్చింది, కానీ నన్ను నిజంగా ప్రేమించే వారు లేరు, నా కోసం త్యాగం చేసే వారు లేరు" అనే వేదన అంతరాంతరాల్లో కలుగుతుంది.

అన్నీ బాగానే ఉన్నా, లోపల శాంతి ఎందుకు లేదు అని వీరు తపన పడతారు. అహంకారంలో ఉన్నప్పుడు ఇవి తెలియవు, కానీ ఈ వేదన మొదలైన తర్వాత ఆలోచన మొదలవుతుంది. ఈ వేదన రోగం వల్ల రావచ్చు, బంధువుల వల్ల రావచ్చు, లేకపోతే ఎంత సంపాదించినా నిజమైన ప్రేమ

దొరకకపోవడం వల్ల రావచ్చు. అందరూ నన్ను ఉపయోగించుకుంటున్నారు, కానీ ఎవరైనా నన్ను చూస్తారా? అనే భావన కూడా కలుగుతుంది.

ఎప్పుడో ఒకసారి అంతరంగ మథనం ప్రారంభమవుతుంది. "ఎలా శాంతి పొందాలి?" అనే తపన వస్తుంది. అప్పుడు మాత్రమే వీరి జీవితంలో ఎవరో ఒకరి ద్వారా మంచి మార్పు వస్తుంది. అది సద్గురువు ద్వారా రావచ్చు లేదా సన్నిహితుల ద్వారా రావచ్చు.

ఈ సాధన నేర్పించినప్పుడు "నీకు శాంతి కావాలంటే ధ్యానం చెయ్, ఈ చోటికి వెళ్ళు, సద్గురువులను ఆశ్రయించు" అని చెప్పవచ్చు. లేకపోతే పుస్తకాలు ఇవ్వడం, పాంప్లెట్ పంచటం వంటి మార్గాల్లో కూడా మార్పు మొదలవుతుంది.

భూమి మీద ఉన్న జీవుల మనస్తత్వాలు పరమాత్మకు తెలియకుండా ఉండవు. మీ వేదన, మీ తపనను తపస్సుగా భావించి ఆయన మీ జీవితానికి ఒక సద్గురువును పంపిస్తాడు. అప్పుడు మీకు సాధన ప్రారంభమవుతుంది.

**4) ప్రౌఢాత్మ దశ:** ఈ ప్రౌఢాత్మ దశలో సాధన చేస్తూ శాంతి పొందినప్పుడు, "ఈ శాంతిని అందరికీ పంచాలి" అనే భావన వస్తుంది. కానీ చూడండి, సాధన చేసిన ప్రతి ఒక్కరికీ ఈ భావన రాదు. "నేను చేసుకుంటున్నాను, నాకు సరిపోతుంది" అనే స్థితిలోనే కొంతమంది ఉంటారు. మీరు కూడా మొదట్లో "నేను నా కోసం సాధన చేసుకోవాలి, నేను ఎదగాలి" అని అనుకుంటారు. ఇది ప్రౌఢాత్మ దశే. కానీ ఇక్కడ ఇంకా పూర్తిస్థాయి వికాసం జరగదు.

**5) వృద్ధాత్మ దశ:** అందరూ బాగుండాలి అనే కోరిక వృద్ధాత్మ దశ. ఎవరైతే "అందరూ బాగుండాలి, అందరికీ ధ్యానం అందాలి, అందరూ శాంతిగా జీవించాలి" అని కోరుకుంటారో వారందరూ వృద్ధాత్మ దశలో ఉన్నట్టే. ఎందుకంటే వృద్ధాత్మ దశలోకి వచ్చినప్పుడు మాత్రమే ఈ ఆత్మజ్ఞానాన్ని మీకే పరిమితం చేయరు. మీరు పొందుతున్న ఆనందాన్ని పది మందికి పంచాలి

అనుకునే భావం కలుగుతుంది. ఇదే వృద్ధాత్మ లక్షణం. మీరు మీ కోసం మాత్రమే చేసుకుంటే అది ప్రౌఢాత్మ దశ. కానీ "పంచాలి, అందరికీ ఉపయోగపడాలి" అనే తపన అంతరాళంలో కలిగితే అది వృద్ధాత్మ దశ.

ఈ వృద్ధాత్మ దశలో మీరు అందరికీ ఈ జ్ఞానాన్ని పంచడం ప్రారంభిస్తారు. ఎదుటి వ్యక్తి కూడా ఆత్మ అని తెలిసినా, ఇంకా మీరు పూర్తిగా ఆత్మ స్థాయికి చేరుకోరు. మీరు ఇంకా దేహాలనే చూస్తారు, వారి మనసులనే గమనిస్తారు.

అందుకే ప్రతి వ్యక్తి జీవితంలో శాంతి ఉండదు అని మీరు గ్రహిస్తారు. శాంతి అనేది మనసుకు సంబంధించినదే కాబట్టి, "వాడికి శాంతి లేదు, వాడు దుఃఖంలో ఉన్నాడు" అని భావించి మీరు అతనికి శాంతి కలిగించాలని ధ్యానం నేర్పుతారు.

ధ్యానం నేర్పిన తర్వాత మీరు కూడా ఎదుగుతారు. ఎందుకంటే మీరు సాధన చేస్తారు, స్వాధ్యాయం చేస్తారు, అదే జ్ఞానాన్ని ఇతరులకు అందిస్తారు. "వాడు శాంతిగా జీవించాలి, బాధలు, కష్టాలు, కన్నీళ్లు లేకుండా ఉండాలి" అనే భావంతో మీరు పది మందికి చెప్తూ ఉంటారు. ఇది వృద్ధాత్మ దశలో కనిపించే లక్షణం.

**6) విముక్తాత్మ దశ:** ఇక తర్వాత విముక్తాత్మ దశ వస్తుంది. ఈ దశలో మీరు గురువు దగ్గర బోధ వింటూ, "నువ్వు ఆత్మవే" అనే సత్యాన్ని లోతుగా గ్రహిస్తారు. "నువ్వు ఆత్మవైతేనే పది మంది కోసం పనిచేస్తావు. నువ్వు శరీరం, మనసు అని అనుకుంటే ప్రక్క వారి బాగు గురించి ఆలోచించవు" అనే అవగాహన వస్తుంది.

అందరి ఆత్మలు ఈ శరీరం అనే జైల్లో బంధించబడి ఉన్నాయని మీరు గ్రహిస్తారు. ఎప్పుడైతే ఆత్మ జ్ఞానం, బ్రహ్మ జ్ఞానం పొందుతారో, అప్పుడు ఈ శరీరం నుంచి ఆత్మలకు విముక్తి కలుగుతుంది, అదే మోక్షం.

ఈ మోక్షాన్ని ఈ జన్మలోనే, ఈ శరీరం ఉండగానే పొందాలి అని

మీరు అర్థం చేసుకుంటారు. దానికి మీరు ఆత్మ జ్ఞాని కావాలి. అలాగే ఇతరులను కూడా ఆ మార్గంలోకి తీసుకువెళ్లాలి.

ఇతరులకు ఆత్మజ్ఞానం బోధించగలగాలి. మీరు నేర్చుకున్నప్పుడు, మీరు అనుభూతి పొందినప్పుడు మాత్రమే మీరు ఇతరులను ఆ మార్గంలోకి నడిపించగలరు. ఆత్మ దర్శనం పొందడమే కాకుండా, "నేను ఆత్మని, అందరూ ఆత్మ స్వరూపులే" అనే అవగాహన మీలో స్థిరంగా ఉంటుంది.

భూమి మీద ప్రతి మానవుడికి మోక్షం పొందే అర్హత ఉంది. వాడు అందగాడా? కాదా? గొప్పవాడా? బీదవాడా? చదువు ఉందా? లేదా? పదవి ఉందా? లేదా అనే విషయాలు అవసరం లేదు. బాహ్య జీవితం కాదు, అంతరంలో ఉన్న ఆత్మ స్వరూపమే ముఖ్యమని మీరు గ్రహిస్తారు. అందుకే ప్రతి ఆత్మ ఈ శరీరం నుంచి విముక్తి పొందాలి అనే తపన ఉంటుంది. అందుకే మీరు అందరికీ ఆత్మజ్ఞానం నేర్పుతారు.

ఇక్కడ ధ్యానం చెప్పడం యొక్క ముఖ్య ఉద్దేశం, చాలా మంది ధ్యానం చెప్తారు, కానీ వారు శరీర లాభాలు, మనో లాభాలు గురించి మాత్రమే చెప్తారు. అవి ఈ ప్రపంచంలో అవసరమైనవే అయినా, ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పొందిన వారే మోక్షాన్ని పొందగలరు. కానీ ఈ సత్యాన్ని చాలా కొద్దిమంది మాత్రమే బోధించగలరు.

అందుకే ఈ ధ్యానం నేర్పడం కూడా శరీర లాభాలు, మనసు యొక్క లాభాలు మాత్రమే చెప్తే వాడు మోక్షం పొందలేడు. ఈ కోరికలు కోరుకుంటూ, అవి తీర్చుకుంటూ, అవి తీర్చే క్రమంలో మళ్ళీ కొన్ని కర్మలు చేస్తూ, మళ్ళీ కొన్ని జన్మలు భూమిమీదకి రావాల్సి వస్తుంది.

ఎప్పుడైతే మీరు ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం నేర్పుతారో, అప్పుడు వాడు తృప్తిగా జీవిస్తాడు, ఉన్న దాంట్లో సంతృప్తి పొందుతాడు. "తృప్తికి మించిన ధనం లేదు" అని గ్రహిస్తాడు. "నా అర్హతను బట్టి భగవంతుడు నాకు ఏది ఇవ్వాలో అదే ఇచ్చాడు, నా దగ్గర ఏది ఉండాలో అదే ఉంటుంది.

ఉండకూడనిది రాదు, వచ్చినా వెళ్లిపోతుంది, ఉండాల్సిందే ఉంటుంది" అనే అవగాహన కలుగుతుంది. ఈ ఆత్మ అనుభవాలు, పాఠాలు నేర్చుకొని మళ్లీ స్వస్థలానికి వెళ్లాలి, అదే మోక్షం అని మీరు తెలుసుకుంటారు. అప్పుడు మీరు అన్ని ఆత్మలకు విముక్తి కలిగించాలి, మోక్షం కలిగించాలి అనే భావంతో వారికి కావలసిన జ్ఞానాన్ని ఇస్తే, మీరు విముక్తాత్మలుగా మారతారు.

**7) పూర్ణాత్మ దశ:** పూర్ణాత్మ దశ అంటే పూర్ణమైన స్థితి. భూమిమీద నేర్చుకోవాల్సింది అంతా పూర్తి చేసుకున్న స్థితి. అప్పుడు మీరు "అందరూ ఆత్మ స్వరూపులే" అనే అనుభవంలో ఉంటారు. దేహాలను చూడరు, ఆ దేహం వెనక ఉన్న ఆత్మ స్థితిని చూడగలుగుతారు. ప్రతి వ్యక్తిలోని ఆత్మను మీరు గుర్తిస్తారు. "పిపీలాది నుంచి బ్రహ్మ పర్యంతం" వరకు అంటే "చిన్న చీమలాంటి జీవి నుంచి సృష్టికర్త బ్రహ్మ వరకు ఉన్న అన్ని జీవులు ఆత్మ స్వరూపమే" అని గ్రహిస్తారు. అన్ని జీవులను ఆత్మగా చూడగలుగుతారు. అప్పుడు సర్వాత్మ భావం మీలో వస్తుంది. సృష్టి అంతా పరమాత్మమయమే, వేరే ఏమీ లేదు అని గ్రహిస్తారు.

ఆత్మ చైతన్యంతోనే సృష్టి నడుస్తోంది అని తెలుసుకుంటారు. లేకపోతే మాయకు వశం అయితే "నేను చేస్తున్నాను, నా వల్ల అవుతుంది" అని అనుకుంటారు. కానీ నిజానికి మీ వల్ల ఏమీ కాదు, పరమాత్మ కృప వల్లే అన్నీ జరుగుతున్నాయి అని మీరు గ్రహిస్తారు. ఈ భావం మధ్య మధ్యలో కాకుండా నిరంతరం వుంటుంది.

మీరు ఏది చూసినా ఆత్మ స్వరూపమే అనే ఎరుకలో వుంటారు. "నేను చేయటం లేదు, నా లోపల ఉన్న ఆత్మ ద్వారా జరుగుతోంది" అనే భావం కలుగుతుంది. ఎవరిని చూసినా సర్వాత్మ భావన కలిగినప్పుడు మీరు పరమాత్మ స్థితికి ఎదుగుతారు, పూర్ణాత్మ స్థితిని పొందుతారు.

అప్పుడు మీకు సృష్టిని అర్థం చేసుకునే శక్తి కూడా వస్తుంది. అందుకే ఆత్మగా వచ్చిన మీరు కొన్ని జన్మలు అజ్ఞానంతో జీవిస్తారు, కొన్ని జన్మలు

అహంకారంతో జీవిస్తారు. శరీర స్థితిలో ఉన్నప్పుడు అజ్ఞానంలో ఉంటారు. మనోస్థితిలో ఉన్నప్పుడు "నేను చేస్తున్నాను, నాకు ఇది ఉంది" అనే అహంకారంతో జీవిస్తారు.

ఇక్కడి నుంచి వేదన మొదలైనప్పుడు, శాంతి లేకపోయినప్పుడు మీరు వెతకడం ప్రారంభిస్తారు. ఆ శాంతి కోసం చేసే తపననే పరమాత్మ తపస్సుగా భావిస్తాడు. అందుకే మీ జీవితంలో గురువు వచ్చి సత్యాన్ని బోధిస్తాడు. మీరు సత్యాన్ని పట్టుకుంటే అజ్ఞానం, అహంకారం తొలగిపోతాయి. అజ్ఞానం, అహంకారం తొలగించడానికి ఏకైక మార్గం ఆత్మజ్ఞానమే.

ఈ ఆత్మజ్ఞానం అనే మందుతో పాటు సాధన అనే ప్రాక్టీస్ కూడా ఉండాలి. "శ్వాస మీద ధ్యాస" అనే సాధన అవసరం. రోగికి మందు, పథ్యం రెండూ అవసరం అయినట్లే, మీకు ఉన్న భవరోగానికి కూడా ఆత్మజ్ఞానం అనే మందు అవసరం. మనసులో ఉన్న వేదన, అశాంతి అనే భవరోగానికి ఆత్మజ్ఞానమే పరిష్కారం.

కానీ ఈ ఆత్మజ్ఞానం డబ్బుతో కొనలేరు. సాధన అనే ప్రయత్నంతోనే పొందాలి. సాధన ఉంటేనే ఆత్మజ్ఞానం వస్తుంది. ఆత్మజ్ఞానం వచ్చినప్పుడే వేదన తొలగుతుంది. ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకుంటే ఈ భూమిమీద అజ్ఞానులు, అహంకారులు ఉండరు. అందరూ ఆత్మజ్ఞానులే అవుతారు.

ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పొందిన వాడే మోక్షాన్ని పొందగలడు. మోక్షం అంటే చనిపోయాక వచ్చే స్థితి కాదు. బ్రతికుండగానే ఆనంద స్థితిలో, తృప్తిగా జీవించడం. ఏది ఉన్నా, ఎంత ఉన్నా, ఉన్నా లేకున్నా తృప్తిగా జీవించగలిగితే అదే మోక్షం. ఈ మానవ జన్మ వచ్చినందుకు, భగవంతుని చేరుకునే అవకాశం వచ్చినందుకు మీరు కృతజ్ఞతతో ఉండాలి.

ఈ దేహం ఉండగానే దేహాన్ని సృష్టించిన వాడిని తెలుసుకోవాలి. దానికి ఒకే ఒక్క సాధన "శ్వాస మీద ధ్యాస" ఉంచి చేసే ధ్యానం ముఖ్యమైనది. నామం, మంత్రం, రూపం ఇవి మనసు దగ్గరే ఆగిపోతాయి. "శ్వాస మీద

ధ్యాస" పెట్టినవాడు ఆత్మను తెలుసుకుంటాడు. ఏ శ్వాస ఆత్మను చేరుతుందో, అదే శ్వాస ద్వారా మీరు ఆత్మను తెలుసుకుంటారు.

ఇటువంటి అద్భుతమైన సాధన మీకు దొరికింది అంటే, "ఇది నా చివరి జన్మ అయ్యే అవకాశం" అని భావించి ఆనందంతో జీవించాలి. అందుకే అజ్ఞానిగా పుట్టినా, అజ్ఞానిగా చావకూడదు అని చెప్తారు. మహర్షులందరూ కూడా "మీరు పుట్టినప్పుడు అజ్ఞానం ఉండొచ్చు, కానీ మీరు చనిపోయేటప్పుడు అజ్ఞానం ఉండకూడదు" అని చెప్తారు.

అలా అజ్ఞానం లేకుండా ఉండే వాడు చావును కూడా పండగలాగా స్వీకరిస్తాడు. ఎందుకంటే ఈ ఆత్మకి శరీరం అనేది చిరిగిన వస్త్రంలాంటిదే, రేపు కొత్త వస్త్రాన్ని ధరించబోతున్నాను అనే భావనతో ఆనందంగా ఉంటాడు. పండగ వచ్చినప్పుడు మీరు కొత్త బట్టలు వేసుకుంటారు, కొత్త వస్త్రాలు తెచ్చుకుంటారు, రేపు వాటిని వేసుకోవాలి అని ఆనందంగా ఎదురుచూస్తారు. అట్లాగే ఆత్మజ్ఞానం, బ్రహ్మ జ్ఞానం పొందిన యోగి శరీరాన్ని వదలడానికి సంబరపడతాడు.

కొత్త శరీరాన్ని పొందడానికి ఆనందంతో స్వీకరిస్తాడు. కానీ చావును దుఃఖంగా భావించడు. ఆత్మజ్ఞానం లేనివాడే చావును దుఃఖంతో ఆహ్వానిస్తాడు. కానీ ఆత్మజ్ఞానం పొందినవాడు చావును పండగలా ఆహ్వానిస్తాడు. అందుకే మహాత్ములు "మీరు అజ్ఞానిగా పుట్టినా, ఆత్మజ్ఞానిగా మరణించాలి" అని చెప్తారు.

మీరు ఇప్పుడు అదే మార్గంలో ఉన్నారు. మీరు ఎంత పొందాలో అంత పొందుతున్నారు. మీరు ఎంత సాధన చేయాలో అంత చేస్తున్నారు. కానీ ఇంకా మీకు ఆత్మదర్శనం, ఆత్మానుభూతి కలగలేదు అంటే ఇంకా సాధన చేయాలి అని మీరు అర్థం చేసుకోవాలి.

# ఆత్మజ్ఞానం పెరగాలంటే?

ఆత్మజ్ఞానం పెరగాలంటే మీరు ఎలా కృషి చేయాలి? మీ జీవన విధానాన్ని ఎలా మార్చుకోవాలి? అనే విషయాలను మీరు ఎన్నో సార్లు తెలుసుకుంటూనే ఉన్నారు. మీరు ఎంత తెలుసుకున్నా మళ్ళీ మళ్ళీ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే పత్రి గారు "నువ్వు చెప్పగలిగే స్థాయికి వచ్చేంత వరకు వినాలి, మీరు ఇంకా చెప్ప లేకపోతున్నారు అంటే వినటంలో లోపం ఉండొచ్చు, లేక మననం చేయడంలో లోపం ఉండొచ్చు, లేక సాధనలో శ్రద్ధ తగ్గి ఉండొచ్చు" అని చెప్పేవారు.

అంటే మీరు సాధన చేస్తున్నప్పటికీ ఇంకా పూర్తిగా అర్థం కాలేదంటే, ఇంకా వినాల్సినవి, తెలుసుకోవాల్సినవి, నేర్చుకోవాల్సినవి, సాధన చేయాల్సినవి చాలా ఉన్నాయి అన్నమాట. ఎందుకంటే మీ శరీరంలో ఉన్న అన్ని ఇంద్రియాలకు శక్తినిచ్చేది ఆత్మే. ఆ ఆత్మశక్తి తగ్గితే మనిషి ఏ పని చేయలేడు. కానీ ఆత్మశక్తి ఉన్నవాడు ఏ పనినైనా సులభంగా చేయగలడు.

ఇంకా లోతుగా తెలుసుకోవాలంటే, గురువు చెప్పిన విషయాలను ప్రతి నిమిషం గుర్తుంచుకుని ఆచరించడానికి ప్రయత్నించేవాడే నిజమైన శిష్యుడు అని పత్రి గారు చెప్పేవారు. అలాగే సరైన జ్ఞానం పొందాలంటే? ముందుగా మీరు తెలుసుకోవాల్సింది, ప్రాపంచికం అంటే ఏమిటి? ఆధ్యాత్మికం అంటే ఏమిటి? ప్రాపంచిక జీవితంలో వచ్చే లాభాలు, నష్టాలు అన్నీ తెలుసుకోవాలి.

ఎందుకంటే ఆధ్యాత్మిక జీవితం జీవించకపోతే, ప్రతి మనిషి ప్రాపంచిక జీవితంలో అన్ని అనుభవిస్తూ "నేను సుఖంగా ఉన్నాను, సంతోషంగా ఉన్నాను" అని అనుకుంటాడు. కానీ నిజానికి దుఃఖం మాత్రం పోదు.

ఆధ్యాత్మిక జీవితంలో మాత్రం మీ దృష్టి సుఖాల మీద నుంచి ఆత్మ మీదికి మళ్ళుతుంది. అప్పుడు మీరు దుఃఖం లేని ఆనంద స్థితి అనుభవిస్తారు.

కానీ ఆధ్యాత్మికం అంటే భగవంతుడి మీద దృష్టి పెట్టడం. భగవంతుడు సృష్టిలో అన్నీ ఇచ్చాడు, కానీ ఆనందాన్ని మాత్రం తన దగ్గరే ఉంచుకున్నాడు. ఎవరైతే తన వైపు తిరుగుతారో అంటే ఆత్మ వైపు తిరుగుతారో వారికే నిజమైన ఆనందం లభిస్తుంది. అందుకే గురువులు మనకు మొదటగా చెప్పేది "భగవంతుడు ఎవరు?" అనే ప్రశ్నకు సమాధానం.

"ఆయన సచ్చిదానంద స్వరూపుడు" అంటే?

- సత్ అంటే --- శాశ్వతమైనది.
- చిత్ అంటే --- చైతన్యవంతమైనది.
- ఆనందం అంటే --- ఆనంద స్వరూపమైనది.

అందుకే ప్రాపంచిక జీవితంలో ఎన్ని భోగాలు ఉన్నా దుఃఖం తప్పదు. కానీ ఆధ్యాత్మిక మార్గంలో ఆవగింజంత నేర్చుకున్నా, నువ్వు ఆనంద స్థితిలో ఉండగలవు అని గురువులు చెప్పారు.

మీరు ఏ క్షణాన ఆత్మ వైపు తిరుగుతారో, ఆ క్షణంలో మీరు భగవంతుడి వైపు తిరిగినట్లే, అప్పుడు ఆనందాన్ని పొందడానికి అర్హత పొందినట్లే. అంతవరకు ప్రాపంచిక జీవితంలోనే "మీరు ఆనందంగా ఉన్నాం" అని అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి అది తాత్కాలిక సంతోషం మాత్రమే.

ఆనందం అంటే తాత్కాలిక మైనది కాదు. సుఖం, సంతోషం లాగా వచ్చి పోయేది కాదు. ఆనందం అంటే శాశ్వతమైనది, ఎప్పటికీ ఉండేది. ఆ ఆనందాన్ని పొందగలిగేది ఎప్పుడు అంటే గురువు దగ్గరకు వచ్చి "మీరు ఎవరు?" అనే సత్యాన్ని తెలుసుకున్నప్పుడు.

"నువ్వు ఆత్మవు" అనే సత్యాన్ని తెలుసుకున్న తర్వాత, ఆ అనుభూతిని పొందడానికి ఎలా జీవించాలో, ఎలా ఉండాలో అన్నది గురువులే మీకు నేర్పిస్తారు. రాఘవరావుగారు కానీ, నేను కానీ పత్రి గారి దగ్గర నుంచి నేర్చుకున్న ఈ విషయాలను మీతో పంచుకోవడానికి కారణం సద్గురువులు ఎప్పుడూ సత్యమే చెప్తారు అన్న నమ్మకం.

ఆ నమ్మకంతో మీరు గురువు దగ్గర చేరి, విని, అర్థం చేసుకుని, మననం చేసుకుని, ఆచరణలో పెట్టి, ఈ జ్ఞానాన్ని మన తర్వాత తరాలకు అందించాలి, అదే పరంపర.

గురువులు ఎందుకు బోధిస్తారు అంటే వారు పొందిన ఆత్మవిద్య ముందున్న తరాలకు అందించాలనే ఉద్దేశంతో శిష్యులకు బోధిస్తారు. అలాగే ఈ కాలంలో సత్యాన్ని బోధించే గురువులు చాలా కొద్దిమందే ఉన్నారు. మరి పత్రిగారిని పొందిన మీరు చాలా అదృష్టవంతులు, ఎందుకంటే మీరు ఆత్మజ్ఞానం పొందే మార్గంలో ఉన్నారు.

కానీ ఈ జ్ఞానం పొందాలంటే మీరు ముందుగా తెలుసుకోవాల్సింది ఏమిటంటే? ఈ సృష్టి అంతా నశించేదే, పరమాత్మ ఒక్కడే శాశ్వతుడు అని. ఈ సత్యాన్ని గ్రహించిన తర్వాత, ఈ సృష్టి మీద వైరాగ్యం కలగాలి అంటే ప్రాపంచిక జీవితం మీద ఆసక్తి తగ్గాలి.

వైరాగ్యం రెండు రకాలుగా చెప్పబడింది:

1. ప్రాపంచిక వైరాగ్యం, 2.ఆధ్యాత్మిక వైరాగ్యం

**1) ప్రాపంచిక వైరాగ్యం గురించి ఆదిశంకరాచార్యులవారు మూడు రకాలుగా చెప్పారు:**

**1. పురాణ వైరాగ్యం:** పురాణాలు విన్నప్పుడు “నేను రాముడిలా, కృష్ణుడిలా ఉండాలి” అని ఆ క్షణంలో అనిపిస్తుంది. కానీ వినడం పూర్తయ్యాక మళ్ళీ మామూలుగా జీవించడం ప్రారంభమవుతుంది.

**2. ప్రసూతి వైరాగ్యం:** బిడ్డను కనేటప్పుడు వచ్చే బాధలో “ఇంక పిల్లలు వద్దు” అనిపిస్తుంది. కానీ కొంతకాలం తర్వాత ఆ బాధ మరిచి మళ్లీ అదే జీవన విధానంలోకి వెళ్తారు.

**3. స్మశాన వైరాగ్యం:** ఎవరైనా మరణించినప్పుడు స్మశానానికి దహనం చేయడానికి తీసుకు వెళతారు. అప్పుడు ఏమనుకుంటారంటే? “ ఎవరు ఏమీ వెంట తీసుకెళ్ళలేరు, అన్నీ ఇక్కడే వదిలి రావలసిందే” అన్న వైరాగ్య భావం

వస్తుంది. కానీ కొద్ది రోజుల్లో అది కూడా మర్చిపోయి మళ్లీ బంధాలలో పడిపోతారు.

అందుకే శంకరాచార్యులు చెప్తారు ఇలాంటి వైరాగ్యం మానవుడికి సరిపోదు. ఇవి క్షణికమైనవి, తాత్కాలికమైనవి. మానవుడికి కావలసింది శాశ్వతమైన వైరాగ్యం.

**2) అందుకే సనాతన ధర్మం ఆధ్యాత్మిక వైరాగ్యాన్ని రెండు రకాలుగా చెబుతుంది:**

- **రాజసిక వైరాగ్యం**
- **సాత్విక వైరాగ్యం**

ఈ రాజసిక వైరాగ్యం ఎప్పుడు కలుగుతుంది అంటే మీ జీవితంలో ఏదైనా నష్టం జరిగినప్పుడు. ఉదాహరణకి: పదవులు పోయినప్పుడు, సంపదలు కోల్పోయినప్పుడు, బంధువులు దూరమైనప్పుడు, లేదా ఇంట్లో ఎవరైనా చనిపోయినప్పుడు అలాంటి సందర్భాల్లో వైరాగ్యం కలుగుతుంది. దీనినే రాజసిక వైరాగ్యం అంటారు.

డబ్బు పోయి, అన్నీ లాస్ అయి, చేతిలో ఏమీ లేకపోయినప్పుడు కొంతమంది వైరాగ్యంతో సన్యాసం తీసుకుని ఆధ్యాత్మికతలోకి వస్తారు. అలాగే పదవి పోయినప్పుడు లేదా జీవితంలో పెద్ద షాక్ వచ్చినప్పుడు కూడా ఆధ్యాత్మిక మార్గంలోకి అడుగు పెడతారు. కానీ ఇలాంటి వైరాగ్యం ఉన్నవాళ్ళు పూర్తిగా మారిపోరు. ఎందుకంటే ఇది అంతరంగం నుంచి వచ్చిన వైరాగ్యం కాదు నష్టం, కష్టం వల్ల వచ్చిన వైరాగ్యం కాబట్టి.

అందుకే కొంతకాలం తర్వాత వారికి అనిపించవచ్చు, “నేను ఎందుకు ఈ మార్గంలోకి వచ్చాను?” “కొంచెం వేచి ఉండాల్సింది” అని. ఎందుకంటే ఆ నష్టం, కష్టం శాశ్వతం కాదు. కాలం గడిచే కొద్దీ అవి తగ్గిపోతాయి. అప్పుడు వైరాగ్యం కూడా తగ్గిపోతుంది.

అందుకే శంకరాచార్యుల వారు నష్టం, కష్టం, పదవులు కోల్పోవడం, బంధువులు దూరమవడం, లేదా మరణం వంటి సంఘటనల వల్ల వచ్చిన

వైరాగ్యం శాశ్వతమైనది కాదు అనిచెప్తారు. అది కొంతకాలం తర్వాత మారి, మళ్ళీ మనసు ప్రాపంచిక జీవితం వైపు మారిపోతుంది. అందుకే ప్రాపంచిక వైరాగ్యాలు కొద్ది రోజులు మాత్రమే ఉంటాయి, తర్వాత మాయం అవుతాయి.

ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చిన తర్వాత కూడా, ఈ రాజసిక వైరాగ్యం ఉన్నవాడు ఒక సమయంలో బాధపడవచ్చు. "ఎందుకు వచ్చాను?" అని అనుకోవచ్చు. ఎందుకంటే ఆధ్యాత్మిక జీవితం మొదట్లో పూలపానుపులా ఉండదు, ముందు అది ముళ్ళ బాటలాగే ఉంటుంది. కానీ ఆ ముళ్ల బాటను కూడా సహనంతో దాటినవాడే చివరకు పూలబాట చేరగలడు.

అందుకే చిన్న చిన్న త్యాగాలు అవసరం, చిన్న చిన్న లాభాలను వదిలేయాలి. అప్పుడు మాత్రమే పెద్ద లాభాలను పొందగలుగుతారు. అందుకే ఇలాంటి తాత్కాలిక వైరాగ్యం కాదు, శాశ్వతమైనది సాత్విక వైరాగ్యమే అని శంకరాచార్యులు గారు చెప్తారు, సాత్విక వైరాగ్యం ఉన్నవాళ్ళకు వారి జీవితంలో ఎలాంటి వ్యక్తిగత కష్టాలు లేకపోయినా, నష్టాలు లేకపోయినా, లోకంలో ఉన్న దుఃఖాన్ని చూసి వైరాగ్యం కలుగుతుంది.

ఇది పరిశీలనతో, విచారణతో వచ్చిన వైరాగ్యం. ఉదాహరణకి రాముడిని చూడండి, తీర్థయాత్రలకు వెళ్ళి ప్రజల్లో ఉన్న దుఃఖాన్ని చూసి వైరాగ్యం పొందాడు. ఆయన ఆలోచనలో మునిగిపోయి నిస్పృహగా ఉన్నప్పుడు, వశిష్ట మహర్షి ఆయనకు జ్ఞాన బోధ చేశారు. ఆ బోధే "వశిష్ఠామృతం"గా ప్రసిద్ధి చెందింది.

అలాగే గౌతమ బుద్ధుని చూడండి ఆయనకు వ్యక్తిగతంగా ఎలాంటి కష్టం లేదు. రాజకుమారుడిగా అన్ని సౌకర్యాల్లో పెరిగాడు కానీ ఒక రోజు బయటికి వెళ్ళి ఒక ముసలివాడిని, రోగిని, మృతదేహాన్ని, అడుక్కునే వాడిని చూసి "ఈ దుఃఖానికి కారణం ఏమిటి?" అని విచారణ మొదలుపెట్టాడు. అప్పుడు ఆయన రాజ భోగాలను వదిలి, సత్యాన్వేషణ కోసం బయలుదేరాడు. అందుకే రాజసిక వైరాగ్యం కంటే సాత్విక వైరాగ్యం శాశ్వతమైనది.

ఇలా చూస్తే వ్యక్తిగత కష్టాలు లేకపోయినా, లోక క్షేమం కోసం వైరాగ్యం పొందిన మహానుభావులు జీసస్ క్రైస్ట్, గౌతమ బుద్ధుడు, రాముడు, గురునానక్, మహమ్మద్ వంటి మహాత్ములు అందరూ ఒకే విషయం గ్రహించారు ప్రజల్లో ఉన్న దుఃఖానికి కారణం “అజ్ఞానం”. అజ్ఞానం అంటే జ్ఞానం లేకపోవడం, అంటే సత్యం తెలియకపోవడం. సత్యం తెలియకపోతే అసత్యాన్నే సత్యంగా నమ్ముతారు, అదే అన్ని కష్టాలకు మూలం. అందుకే “జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణాం” అన్నారు. అంటే జ్ఞానం వచ్చినప్పుడే కర్మలు దగ్ధమవుతాయి.

కానీ జ్ఞానం పొందాలంటే మీలో శక్తి పెరగాలి. మీలో అనంతమైన శక్తి ఉన్నా, అది పూర్తిగా బయటకు రావడం లేదు, ఆ శక్తిని బయటకు తెచ్చేదే ధ్యానం. అందరు ధ్యానం చేసి ఆత్మ శక్తిని పెంచుకుంటే జ్ఞానం పెరుగుతుంది, జీవితం మారుతుంది, కర్మలు దగ్ధమవుతాయి.

కానీ సాధారణంగా మీరు సాధన చేయకుండా, గుడికి వెళ్ళి పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యాలు పెట్టి, ప్రతి రూపాన్ని దైవంగా భావించి కష్టాలు పోవాలని కోరుకుంటున్నారు. కానీ గురువులు చెప్పిన సత్యం ఏమిటంటే మీ కష్టాలు పోవాలంటే జ్ఞానం పెరగాలి.

భగవద్గీత వంటి సద్గ్రంథాలు ఉన్నాయి. కానీ వాటిని అర్థం చేసుకునే శక్తి మీలో తక్కువగా ఉంది. ఎందుకంటే మీలో ఆత్మశక్తి ఇంకా పూర్తిగా మేల్కొలప లేదు. ప్రస్తుతం మీకు ఉన్న శక్తి కేవలం రోజువారీ జీవితం నడపడానికి సరిపోతుంది. కానీ ఎప్పుడైతే మీరు ధ్యానం చేస్తారో, ఆత్మశక్తిని పెంచుకుంటారో అప్పుడు మీరు ప్రతి విషయాన్ని సులభంగా నేర్చుకోగలరు, అర్థం చేసుకోగలరు.

చిన్న పిల్లవాడిని చూడండి అతనికి ఏమీ తెలియదు. అతని అవసరాలన్నీ అమ్మే చూసుకుంటుంది. కానీ కొంత వయసు వచ్చిన తర్వాత, తన అవసరాలను తానే తీర్చుకోవాలి. అలాగే మీరు కూడా ఆధ్యాత్మికంగా

ఎదగాలంటే మీరే ప్రయత్నం చేయాలి.

ఇప్పుడు మీకు ప్రాపంచిక జీవితానికి కావలసినంత శక్తి ఉంది. కానీ ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే ఎక్కువ శక్తి అవసరం. ఆ శక్తిని పొందే మార్గమే ధ్యానం. ధ్యానం తక్కువగా ఉంటే మీలో పెద్దగా మార్పు ఉండదు.

కానీ ధ్యానం ఎక్కువైనప్పుడు, ఆత్మశక్తి పెరిగినప్పుడు మీలో ఉన్న అన్ని అంతర్గత శక్తులు బయటకు వస్తాయి.

గమనించండి ఇతరుల కష్టాలను చూసి మనసు కదిలి, కలిగే వైరాగ్యమే శాశ్వతమైన వైరాగ్యం. ఇది ఎలా అర్థమవుతుంది అంటే మహాత్ముల చరిత్రలను పరిశీలిస్తే మనకు స్పష్టంగా తెలుస్తుంది.

రాముడుకి వచ్చిన వైరాగ్యం, గౌతమ బుద్ధుడికి వచ్చిన వైరాగ్యం, జీసస్ క్రైస్ట్ కి వచ్చిన వైరాగ్యం ఇవి అన్నీ ఒకే మూలం నుంచి వచ్చాయి. అది ఏమిటంటే సృష్టిలో ఉన్న దుఃఖాన్ని చూసి, “ఈ దుఃఖానికి కారణం ఏమిటి?” అని విచారణ చేయడం.

వాళ్ళకు వ్యక్తిగతంగా ఎలాంటి కష్టాలు లేకపోయినా, ప్రపంచంలోని బాధలను చూసి వారు కదిలిపోయారు. ఆ దుఃఖానికి కారణం తెలుసుకోవాలని సంకల్పించారు. అందుకే వారు సత్యాన్వేషణకు బయలుదేరారు. వారు తెలుసుకున్నారు ప్రాపంచిక భోగాల పట్ల ఆసక్తి ఉంటే, ఆధ్యాత్మికంగా ఎదగలేమని.“జీవితం అంటే కేవలం తినడం, సుఖాలు అనుభవించడం మాత్రమేనా?” అనే ఆత్మ విచారణ వాళ్ళలో కలిగింది. ఆ ఆత్మవిచారణ వారిని మహాత్ములుగా మార్చింది. అందుకే మహానుభావులు ఎప్పుడూ తమ కోసం కాదు ప్రపంచం కోసం జీవించారు, అందుకే వారు పూజించబడుతున్నారు.

కానీ మీరు మీసుఖం, మీ సంతోషం మాత్రమే చూస్తున్నారు. చిన్న కష్టం వచ్చినా,“ఇది ఎందుకు వచ్చింది?” అని విచారణ చేయరు, ప్రక్కవారిని, తప్పుపడతారు. ఇప్పటి మనిషి జీవితం అంత బిజీగా మారిపోయింది తన

గురించి తాను ఆలోచించడానికి కూడా సమయం లేదు.

ఒక కష్టం వచ్చినప్పుడు: "నేను ఏ తప్పు చేశాను?" "దానికి కారణం ఏమిటి?" అని విచారణ చేయకుండా, మనసులో ద్వేషం పెంచుకుంటున్నారు. అసలు కారణం తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడం లేదు. కానీ నిజంగా విచారణ చేస్తే కారణం మీకు స్పష్టంగా తెలుస్తుంది. ఆధ్యాత్మికంగా ఎదగాలంటే ప్రాపంచిక కోరికలపై, భోగాలపై కొంతైనా వైరాగ్యం ఉండాలి. అది లేకపోతే, మీరు ఉన్నత స్థితిని చేరలేరు. ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహిస్తే ప్రతి మనిషి గురువుగా ఎదగగలరు

గౌతమబుద్ధుడు చేసిన త్యాగం కానీ, రాముడు చేసిన త్యాగం కానీ, శ్రీకృష్ణుడు చేసిన త్యాగం కానీ ఒక్కసారి మీరు లోతుగా విచారణ చేస్తే చాలా గొప్ప సత్యం అర్థమవుతుంది. రాముడిని చూడండి రేపు చక్రవర్తి కావాల్సిన వ్యక్తి, కానీ ఒక్కసారిగా 14 సంవత్సరాలు అడవికి వెళ్ళమని చెప్పినప్పుడు, ఎలాంటి ప్రశ్న లేకుండా అంగీకరించాడు. ఎందుకంటే ఆయనకు స్పష్టంగా తెలుసు "ఇది దైవ నిర్ణయం" అని. లక్ష్మణుడు కోపంతో స్పందించినప్పుడు, రాముడు చెప్పిన మాట ఎంతో గొప్పది, "దైవాన్ని నువ్వు ఎదుర్కొనగలవా? ఇది పిన్ని నిర్ణయం కాదు, దైవ నిర్ణయం" అని. అంటే నిన్న నేను రాజ్యం అనుకున్నా, ఈరోజు అడవి అనుకుంటే కూడా అది దైవ సంకల్పమే అని అంగీకరించాను.

అలాగే గౌతమబుద్ధుడు జీవితాన్ని చూడండి తండ్రి సుఖాల్లో పెంచాడు, కష్టం తెలియకుండా చూసుకున్నాడు. కానీ ఒక రోజు బయట చూసిన దృశ్యాలు ఆయన జీవితాన్ని మార్చేశాయి. అది కూడా ఒక దైవ సంకేతమే. అది జరగకపోతే బుద్ధుడు రాజప్రాసాదం వదిలి బయటికి వచ్చేవాడు కాదు. అలాగే జీసస్ క్రైస్ట్ కూడా తన దేశంలో సత్యాన్ని చెప్పాలి అని నిర్ణయం తీసుకున్నాడు, అది కూడా దైవ సంకల్పమే.

ఇలా చూస్తే మహాత్ములు అందరూ లోకకల్యాణం కోసం జన్మించిన

వారు. వారి మార్గంలో అవరోధం వచ్చినప్పుడు కూడా భగవంతుడే వారిని ముందుకు నడిపిస్తాడు. ఇతరుల కష్టాలను చూసి విచారణ చేస్తూ ముందుకు వెళ్ళేవాడే లోకకళ్యాణం చేయగలడు.

కానీ నేటి కాలంలో విచారణ చాలా తక్కువ. విచారణ లేకపోతే ఎదుగుదల కూడా తక్కువగానే ఉంటుంది. గౌతమబుద్ధుడు ఒక గొప్ప సత్యం చెప్పారు "చిన్న చిన్న సుఖాలను వదిలితేనే పెద్ద సుఖం వస్తుంది" అని. అల్ప సుఖాలను త్యాగం చేయలేని వాడికి, అధిక సుఖాన్ని పొందే అర్హత ఉండదు. అల్ప సుఖం అంటే ప్రాపంచిక సుఖాలు. వాటిని కొన్నైనా వదిలి పెట్టాలి.

ఉదాహరణకి: బ్రహ్మముహూర్తంలో లేవాలంటే నిద్రను త్యాగం చేయాలి, బద్ధకాన్ని వదిలేయాలి. ఈ రెండు త్యాగాలు లేకుండా ఎవరూ ఆత్మజ్ఞాని కాలేరు. ఎన్నో జన్మలుగా మీరు నిద్రపోతూనే ఉన్నారు. ఇప్పటికైనా జ్ఞానం కోసం లేవాలి.

భగవద్గీతలో కూడా చెప్పబడింది "జ్ఞానులే నాకు ఇష్టులు" అని. అంటే సాధన చేసే వారినే భగవంతుడు ఇష్టపడతాడు. అందుకే మీరు సాధన చేసి, భగవంతునికి ఇష్టులమైతే ఆత్మానుభూతి పొందగలమనే నమ్మకం మనకు వస్తుంది.

అల్ప నిద్రను, అల్ప సుఖాలను త్యాగం చేస్తే ఆత్మజ్ఞానం అనే మహదానందం లభిస్తుంది. ఆహారం విషయంలో కూడా గురువులు చెప్పింది పాటించాలి. సాత్విక ఆహారం తీసుకుంటే మనసు, శరీరం శుభ్రంగా ఉంటాయి. ఆహారంపై వైరాగ్యం లేకపోతే, మానవ జన్మ పొందినా సాధించాల్సింది సాధించలేరు. నిజానికి మానవ జన్మ ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే దైవాన్ని తెలుసుకోవడం, "నేనెవరు?" అనే సత్యాన్ని గ్రహించడం. ఇది చివరి జన్మగా మారే అవకాశం ఉన్న జన్మ. ఈ సత్యం తెలియకపోతే మీరు పశువుల్లా జీవిస్తారు. తెలుసుకున్న తర్వాత మీ జీవితం మారాలి. నిజం చెప్పాలంటే ఇప్పుడే మీ అసలైన జన్మ. ఎందుకంటే ఇప్పటివరకు ప్రాపంచిక జ్ఞానం మాత్రమే

నేర్చుకున్నారు. కానీ ఇప్పుడు ఆత్మజ్ఞానం కూడా తెలుసుకుంటున్నారు. మీ గమ్యం ఏమిటో తెలుసుకున్నారు.

దానికి కావలసిన ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఇది పొందాలంటే ప్రాపంచిక జీవితంపై కొంతైనా వైరాగ్యం అవసరం. వైరాగ్యం అంటే వదిలేయడం కాదు ఆసక్తిని తగ్గించుకోవడం. గురువు చెప్పిన మార్గాన్ని ఆచరించాలి, లేకపోతే నష్టపోయేది మీరే. గురువు ఒక ప్రవాహం లాంటివాడు. ప్రవహించే నీరు అందరికీ అందుబాటులో ఉంటుంది. ఉపయోగించుకునే వాడికే ప్రయోజనం ఉంటుంది. అలాగే గురువు చెప్పిన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టినవారికే ఆధ్యాత్మిక ఎదుగుదల ఉంటుంది. లేకపోతే "ఇది మీ వల్ల కాదు" అని వెనక్కి తగ్గితే, మీ ప్రయాణం ఎప్పుడూ వెనక్కే సాగుతుంది.

అందుకే ఆధ్యాత్మిక జీవితంలోకి రావడం ఒక సాహసం అయితే, దాంట్లో నిలబడటం మరింత గొప్ప సాహసం. దానికి ధైర్యం కావాలి, దమ్ము కావాలి, స్థిరత్వం కావాలి. ఆధ్యాత్మిక జీవితంలో నిలబడటం అంత తేలిక కాదు. ప్రతి క్షణం పరీక్షలే, కానీ ఆ పరీక్షలు మిమ్మల్ని పడగొట్టడానికి కావు, ఎదగడానికి వచ్చినవే. ఏ పరీక్ష వచ్చినా మీరు ఇలా ఆలోచించాలి, "ఇది నేను ఎదిగే సమయం వచ్చింది కాబట్టే నా జీవితంలోకి వచ్చింది" అని. అప్పుడు మీరు దాని నుంచి పారిపోకుండా, దానిని అర్థం చేసుకుని, దానికి పరిష్కారం వెతుకుతూ ముందడుగు వేయాలి. వెనక్కి పారిపోవడం వీరత్వం కాదు. ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లడమే నిజమైన వీరత్వం. యుద్ధంలో కూడా హీనులు వెనక్కి పారిపోతారు. ధీరులు మాత్రం "విజయమా? మరణమా?" అని ఆలోచించి ముందుకు వెళ్తారు.

మీరు ఒక ఆధ్యాత్మిక యుద్ధం చేస్తున్నారు. ఇక్కడ వెనక్కి వెళ్ళే అవకాశం లేదు, విజయం కోసం ముందుకు సాగాలి. ముందుగా మీరు ఆత్మ గురించి తెలుసుకోవాలి, ఆత్మజ్ఞానం పొందాలి.

తర్వాత ఈ బ్రహ్మం అంటే ఏమిటి? లోకాలు అంటే ఏమిటి? ఈ

సృష్టి అంటే ఏమిటి? ఇవి తెలుసుకుని బ్రహ్మజ్ఞానం పొందాలి.

అలాగే గత జన్మల కర్మలను పూర్తి చేయాలి. వాసనలు, సంస్కారాలను తొలగించాలి. ఇవి తొలగినప్పుడే ఆత్మానుభూతి కలుగుతుంది. అందుకే ఆదిశంకరాచార్యులవారు చెప్తారు అన్ని వైరాగ్యాలలో సాత్విక వైరాగ్యమే గొప్పది అని. ఈ వైరాగ్యం ఉన్నవాడు ఇక జీవితంలో వెనక్కి వెళ్ళడు.

అతని జీవితం అంతా పురోగమనమే ఇలాంటి వ్యక్తులే విశ్వకళ్యాణం కోసం ముందుకు సాగుతారు. ప్రజల దృష్టిలో వారు భగవంతుల్లా కనిపిస్తారు.

లోకసేవ చేసినవారిని లోకేశుడు మెచ్చుకొని ఇంకా ముందుకు తీసుకెళ్తాడు. అందుకే ప్రశ్నించుకోవాలి, మీకు ఏ వైరాగ్యం కావాలి? మీరు మాత్రమే ఆనందంగా ఉండటం కాదు, మీ వల్ల ఇతరులు కూడా ఆనందంగా ఉండాలి. అలాంటి భావన మీలో రావాలి. జ్ఞానం వచ్చినప్పుడు అహంకారం పెరగకూడదు. ధ్యానం పెరిగినప్పుడు వైరాగ్యం పెరగాలి. వైరాగ్యం అంటే "అందరూ ఆనందంగా ఉండాలి" అనే హృదయం.

ఈ భూమిపై ప్రతి జీవి ఆనందంగా ఉండడానికి అర్హులు. కానీ ఆ ఆనందం మీకు మాత్రమే కాకుండా, ఇతరులకూ అందించాలనే భావన వచ్చినప్పుడే నిజమైన ఆధ్యాత్మిక పురోగతి మొదలవుతుంది. అంతవరకు మీరు సాధించాం అనుకుంటారు కానీ నిజంగా సాధించలేదు. మీ కన్నీళ్ళు తుడుచుకోవడం మాత్రమే కాదు, ఇతరుల కన్నీళ్ళు కూడా తుడవగలగాలి. అదే నిజమైన ఆధ్యాత్మికత.

# గురువు యొక్క ఆవశ్యకత ఏమిటి?

మీరు ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నారు, ఎన్నో తెలుసుకుంటున్నారు, ఎంతో సాధన చేస్తున్నారు. కానీ ఈ వీటికీ మూలం ఎవరు అని ఒక్కసారి ఆలోచిస్తే, మీకు నిజం అర్థమవుతుంది. సాధన చేయడానికి, స్వాధ్యాయం చేయడానికి, జ్ఞానం పొందడానికి, జ్ఞానం పంచడానికి మీరు ఎంత నేర్చుకున్నా, వీటన్నిటికి కారణం గురువే అని తెలుస్తుంది. అందుకే గురువు అనేవారు ఎంతో అవసరం.

మరి ఈరోజు గురువు యొక్క ఆవశ్యకత ఏమిటి? గురువు వల్ల శిష్యులు ఎలా ఉన్నతంగా ఎదుగుతారు? అనే విషయాన్ని తెలుసుకుందాం. ప్రాపంచిక జీవితంలో మీకు దుఃఖం, బాధ, అశాంతి, అసంతృప్తి ఇవన్నీ ఏదో ఒక సమయంలో తప్పకుండా ఉంటాయి.

ఎన్ని పూజలు చేసినా, శాంతి కోసం ప్రయత్నించినా, కుటుంబం కోసం, సమాజం కోసం ఎంత కష్టపడినా అసంతృప్తి పోదు. దుఃఖం తగ్గదు, బాధలు తొలగవు, మనసు అశాంతిగానే ఉంటుంది.

"ఎందుకు నా జీవితంలో ఈ వెలితి ఉంది?" అనే ప్రశ్న మీలో వస్తుంది. ఉదాహరణకు, ఒక కుటుంబ యజమాని రోజంతా కష్టపడి, తన కుటుంబం సుఖంగా ఉండాలని ఎంతో డబ్బు సంపాదిస్తాడు. కానీ వారు సుఖంగా ఉన్నారని తెలిసినా కూడా, అతని మనసులోని వెలితి పోదు

అలాగే ఎన్ని దానధర్మాలు చేసినా, "ఇలా చేస్తే శాంతి వస్తుంది" అనుకున్నా కూడా, అశాంతి పోదు. ఇక్కడ పెద్దలు ఒక ఉదాహరణ చెబుతారు. శరీరానికి రోగం వస్తే, సరైన డాక్టర్ సరైన మందు ఇస్తేనే రోగం తగ్గుతుంది. సరికాని డాక్టర్, సరికాని మందు ఇస్తే రోగం తగ్గదు, బాధ తగ్గదు.

అలాగే మీకు ఉన్న సమస్యలు శరీరానికి సంబంధించినవి కావు

అవి మనసుకు సంబంధించినవి. అందుకే దీనిని "భవరోగం" అంటారు. అంటే, మనసు అసంతృప్తిగా, అశాంతిగా ఉన్నప్పుడు "ఏదో కావాలి, కానీ ఏమిటో తెలియదు, ఎన్ని చేసినా తృప్తి లేదు" అనే భావం వస్తుంది.

అప్పుడు పరమాత్మ కృప వల్ల గురువులు మీ జీవితంలోకి వస్తారు. కానీ ప్రతి గురువూ ఈ భవరోగానికి మందు ఇవ్వలేరు. సద్గురువు మాత్రమే మీ దుఃఖానికి కారణం ఏమిటో చెప్పి, ఆ దుఃఖాన్ని తొలగించే మార్గాన్ని చూపగలడు. అందుకే ప్రతి ఒక్కరి జీవితంలో గురువు అవసరం తప్పనిసరిగా ఉంటుంది.

ఎక్కడో కొన్ని కారణజన్ములకు గురువు అవసరం లేకపోవచ్చు. కానీ భూమిపై ప్రతి ఒక్కరికి ఇహలోక విద్యను నేర్చుకోవడానికి, అలాగే పరమాత్మను తెలుసుకోవడానికి గురువు తప్పనిసరిగా అవసరం ఉంటుంది.

భగవంతుడి కృప వల్లే మీ జీవితంలో సద్గురువులు ప్రవేశిస్తారు. అయితే సద్గురువులు అందరికీ దొరకరు, ఎందుకంటే వారు ఉన్నా, వారిని గుర్తించే దృష్టి ప్రతి ఒక్కరిలో ఉండదు. మన మనస్తత్వం, కారక్టర్, శీలం, అంత:కరణ పవిత్రత ఏ స్థాయిలో ఉన్నాయో, అదే స్థాయిలో వారి బోధ మనకు అర్థమవుతుంది.

ఇప్పుడు గమనిస్తే, ఒక గురువును అనుసరించే వారు వందల మంది ఉంటారు,  కానీ ఆయన ఆశయం, మనసు, సందేశాన్ని పూర్తిగా గ్రహించే వారు చాలా కొద్దిమంది మాత్రమే ఉంటారు.

ఇక చాలా మంది సాధన చేస్తున్నా, వారు ఆరోగ్యం మరియు మానసిక ప్రశాంతత దగ్గర ఆగిపోతున్నారు, అంతకంటే లోతైన జ్ఞానం తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడం లేదు. కానీ గురువు చెప్పిన అసలు సూత్రం చాలా స్పష్టంగా ఉంటుంది, ధ్యానం, జ్ఞానం, మోక్షం.

అంటే ధ్యానం ద్వారా జ్ఞానం వస్తుంది, జ్ఞానం ద్వారా మోక్షం

లభిస్తుంది. గురువు చివరికి చెప్పినది ఈ జీవితం యొక్క పరమ లక్ష్యం మోక్షమే. అయితే "మోక్షం" అనే పదం చాలా మందికి స్పష్టంగా అర్థం కావడం లేదు, కొందరు దానిని జీవితానికి సంబంధం లేనిది అని భావిస్తారు, మరికొందరు అది అవసరం లేదని కూడా అనుకుంటున్నారు.

కానీ మోక్షం పొందినవాడే ఇహలోకంలోనూ, పరలోకంలోనూ నిజమైన శాంతి, సుఖం, ఆనందంతో జీవించగలడు. ఇది ఒక పరమ సత్యం, పరమ రహస్యం. కానీ ఈ సత్యాన్ని తెలుసుకున్న వాడు మాత్రం పరిస్థితులు ఎలా ఉన్నా అంతరంగంలో శాంతిగా, స్థిరంగా జీవిస్తాడు; ఎందుకంటే అతను నిజమైన ఆనందం తనలోనే ఉందని గ్రహిస్తాడు. కానీ ఈ సత్యాన్ని తెలుసుకున్న వాడు మాత్రం పరిస్థితులు ఎలా ఉన్నా అంతరంగంలో శాంతిగా, స్థిరంగా జీవిస్తాడు; ఎందుకంటే అతను నిజమైన ఆనందం తనలోనే ఉందని గ్రహిస్తాడు.

ఈ సత్యాన్ని తెలియజేసేది గురువే. ధ్యానం చేయకముందు మనం దేవుడిని గుడిలో లేదా పూజామందిరంలో ఉన్న విగ్రహంగా భావించి పూజలు చేస్తూ, కోరికలు కోరుతూ జీవిస్తాం.

మీరు పూజలు చేసి, మొక్కులు, ప్రసాదాలు సమర్పించి "నేను నా విధి చేశాను" అని తృప్తి పడతాం, అయినా జీవితంలో కష్టాలు పోవు. అంటే మీరు దేవుణ్ణి ఎలా భావించారు అంటే మాటే చిన్న కష్టం కూడా రాకుండా కాపాడే వాడిగా మాత్రమే భావించారు.

కానీ గురువు వచ్చినప్పుడు నువ్వు సత్యాన్ని ఆశ్రయిస్తేనే ఆనందం లభిస్తుంది, అసత్యాన్ని పట్టుకుని ఆనందం పొందాలని అనుకుంటే అది దొరకదు. ఆనందం సత్యం దగ్గరే ఉంటుంది. నువ్వు "నేను దేవుణ్ణి మెప్పిస్తున్నాను" అని అనుకుంటున్నావు, కానీ నిజానికి నువ్వు దేవుణ్ణి మెప్పించడం లేదు.

మానవ జన్మ ఎందుకు వచ్చిందో నీకు తెలియదు, మానవ జన్మ వచ్చిన తర్వాత నీ కర్తవ్యం ఏమిటో కూడా తెలియదు. కాని మానవ జన్మ యొక్క కర్తవ్యం మరుజన్మ లేకుండా చేసుకోవడం. మరి ఆ మరుజన్మ లేకుండా ఉండాలంటే, పుణ్య కర్మలు చేసి కర్మలను పెంచుకోవడం కాదు, కర్మ రాహిత్యాన్ని పొందాలి.

నిష్కామకర్మ ద్వారా  దైవాన్ని మెప్పించగలగాలి. ఈ విషయాలు సద్గురువుకే పూర్తిగా తెలుస్తుంది, సత్యం కూడా సద్గురువుకే తెలుస్తుంది. ఆయనకు తెలిసిన సత్యం మాటలలో మాత్రమే కాదు, అనుభవం నుంచి వచ్చినది; అందుకే ఆయన బోధ కూడా మనల్ని అదే సత్యానుభూతి వైపు నడిపిస్తుంది.

అందుకే గురువులు చెబుతారు, “నువ్వే భగవంతుడివి, ఒకసారి నీ శరీరంలోకి వెళ్ళి చూడు, భగవంతుడు ఎవరో తెలుస్తుంది” భగవంతుడిని వదిలి వేరే దాన్ని ఆశ్రయించి “నాకు శాంతి లేదు, సుఖం లేదు” అని బాధపడటం అజ్ఞానం. భగవంతుడు నీలో ఆత్మగా ఉన్నాడు. ఆయన్ని చేరుకునే మార్గం  ధ్యానం. సత్యం అంటే శాశ్వతంగా ఉండేది. నువ్వు ఆరాధిస్తున్నవి అన్నీ శాశ్వతమా? కాలగర్భంలో ఎన్నో నశించిపోయాయి, ఇవి కూడా అలాగే నశించేవే. చరిత్ర చెబుతుంది ఎన్నో రాజ్యాలు సముద్రంలో కలిసిపోయాయి, ద్వారక కూడా అంతే.

అయితే నువ్వు పూజించే విగ్రహం శాశ్వతంగా ఉంటుందా? ఉండదు. శాశ్వతంగా ఉండేది భగవంతుడే, ఆయనే సత్యం. ఆ భగవంతుడు సృష్టి అంతటా ఉన్నాడు, నీలో ఆత్మగా ఉన్నాడు. ఆయన్ని ఆరాధించే ఏకైక మార్గం ధ్యానం. గురువు రాక ముందు ఈ సత్యం మీకు తెలియదు, సత్యాన్ని ఎలా చేరుకోవాలో కూడా తెలియదు.

మీరు ఆయన సృష్టిని చూసి ఆనందించారు, కానీ ఆయన ఎవరో

తెలుసుకోలేకపోయారు. అందుకే పదార్థాన్ని చూసి సంతోషపడటం కాదు, యదార్థాన్ని తెలుసుకున్నప్పుడే నిజమైన ఆనందం వస్తుంది. యదార్థాన్ని తెలుసుకునే సామర్థ్యం ఉన్న ఏకైక జీవి మానవుడు.

ఎన్నో జన్మలు తీసుకుని వచ్చినా, యదార్థం తెలియకపోవచ్చు, కానీ ఈ మానవ జన్మలో సద్గురువు వచ్చినప్పుడు యదార్థం తెలుసుకోవచ్చు. పదార్థాన్ని చూసినప్పుడు తాత్కాలిక సంతోషం వస్తుంది, కానీ యదార్థాన్ని తెలుసుకున్నప్పుడు బ్రహ్మానందం లభిస్తుంది, అది కాలంతో మారని ఆనందం. సాధనలోకి వచ్చినప్పుడు మీకు ఈ ఆనందం క్రమంగా అనుభవంగా మారుతుంది.

ఇంకా లోతుగా వెళ్ళినప్పుడు శూన్య స్థితి వస్తుంది, అది చాలా ఆనందదాయకంగా ఉంటుంది. ఆ శూన్యాన్ని మరింత లోతుగా తీసుకెళ్తే మహా శూన్య స్థితి వస్తుంది. మహా శూన్య స్థితి అంటే ప్రపంచం, శరీరం, మనసు లేకుండా ఉండే స్థితి. ఈ సత్యాన్ని తెలియజేయడానికి సద్గురువు అవసరం. సద్గురువు లేకపోతే మీలోని దైవత్వాన్ని తెలుసుకోలేరు, సృష్టిలోని పర బ్రహ్మ స్వరూపాన్ని కూడా గ్రహించలేరు. గురువు లేకపోతే అరిషడ్వర్గాలు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అదుపులో వుండవు.

అప్పుడు మీరు భగవంతుడిని తెలుసుకోలేరు. ఈ అంతర్గత శత్రువులను అదుపు చేయడానికి సాధారణ గురువులు సరిపోరు. సద్గురువే జ్ఞానం అనే ఖడ్గాన్ని ఇచ్చి వాటిని జయించడానికి సహాయం చేస్తాడు. అరిషడ్వర్గాలను అదుపులో ఉంచిన వాడే ప్రశాంత చిత్తుడు. అవి పూర్తిగా లేకుండా చేయడం కాదు, అవి మీ అదుపులో ఉండాలి. ఒక రాజు తన ప్రజలను ఎలా నియంత్రణలో ఉంచుతాడో, అలాగే మనిషి తన అరిషడ్వర్గాలను అదుపులో ఉంచుకోవాలి.

ఈ విధంగా అరిషడ్వర్గాలను నియంత్రించడం గురువు ద్వారా

నేర్చుకోవాలి. దాని ద్వారా మనసు శక్తి తగ్గి, ఆత్మ శక్తి క్రమంగా పెరుగుతుంది. ప్రాపంచిక విద్య నేర్పడానికి అనేక గురువులు ఉంటారు, కానీ పరమాత్మ విద్య (పరావిద్య) నేర్పేది సద్గురువే. జన్మలను పెంచే మార్గాలు చాలానే ఉంటాయి, కానీ జన్మలను తగ్గించి, మోక్షానికి తీసుకువెళ్లేది సద్గురువే. ఈ విధంగా అరిషడ్వర్గాలను నియంత్రించడం గురువు ద్వారా నేర్చుకోవాలి. దాని ద్వారా మనసు ప్రభావం తగ్గి, ఆత్మ శక్తి క్రమంగా పెరుగుతుంది.

అందుకే సద్గురువుల అవసరం ప్రతి మానవుడికి ఉంటుంది. సత్యాన్ని తెలుసుకోలేని స్థితిలోనే మానవుడు దుఃఖంతో, బాధతో విలవిల్లాడతాడు. ఎప్పుడైతే గురువు మీ జీవితంలోకి వస్తాడో, అప్పుడే మీకు వచ్చే దుఃఖాలు, బాధలు, రోగాలు ఇవన్నీ నా కర్మ ఫలమే అని తెలుసుకుంటారు. ఆ పరమ సత్యాన్ని గ్రహించిన తర్వాత, ఆ కర్మ ఫలాలను ఓర్పుతో అనుభవించాలి.

ప్రారబ్ధ కర్మలను ధ్యానం ద్వారా, ధ్యాన శక్తితో ఓర్చుకుంటూ ఉంటారు. సంచిత కర్మలను కూడా ధ్యానం ద్వారా తగ్గించుకుంటూ, క్రమంగా కరిగించుకొంటూ ఉంటారు. మీ జ్ఞానం ఎంత పెరుగుతుందో, అంతగా సంచిత కర్మలు కరిగిపోతూ ఉంటాయి. “నేను ఇప్పటికే చాలా కర్మలను ఓర్చుకున్నాను” అని అనిపిస్తే, గురువు ఇచ్చిన సాధన, జ్ఞానం ఎంత గొప్పదో అర్థం చేసుకోవాలి.

అజ్ఞానం ఉన్నప్పుడు, “భగవంతుడికి నా మీద దయ లేదు” అని అంటారు. ఏ కష్టం వచ్చినా, మీ మొదటి మాట అదే “నేను ఇంత పూజ చేస్తున్నాను, అయినా దేవుడు దయ చూపడం లేదు.” కానీ గురువు వచ్చిన తర్వాత మీరు భగవంతుడికి మీ మీద అపారమైన దయ ఉంది అని గ్రహిస్తారు.

అందుకే ఈ విశాలమైన సృష్టిని సృష్టించి అయన మనకు ఇచ్చాడు. నిజానికి మీ మీద మీకే దయ లేదు, ఎందుకంటే ప్రతి కర్మను అనుభవించాలి. ఈ సత్యం తెలిసిన తర్వాత, మీరు జాగ్రత్తగా ఉండి చెడ్డ కర్మలు చేయకుండా

మిమ్మల్ని మీరే కాపాడుకోవాలి. ఇంత జ్ఞానం పొందిన తర్వాత కూడా, సద్గురువుని పొందిన తర్వాత కూడా, సత్యం తెలిసిన తర్వాత కూడా ఇంకా అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం, దొంగతనం చేయడం చేస్తే అది మీ మీద మీకు జాలి లేనట్టే.

నీ మీద నీకే జాలి లేకపోతే, భగవంతుడికి లేదా గురువుకి ఎందుకు ఉంటుంది? పరమాత్మ సద్గురువును మన కోసం పంపించాడు. సద్గురువు ఎంతో జ్ఞానాన్ని శిష్యులకు అందిస్తున్నాడు. కానీ మీ ప్రవర్తనను మార్చుకోకపోతే, మీరు చేసే ప్రతి కర్మ తదుపరి జన్మకు కారణం అవుతుంది.

మీ ఆలోచనలు, మాటలు, చర్యలు ఇవన్నీ కలిసి మీ భవిష్యత్తును నిర్మిస్తాయి. కొన్ని కర్మలను ఈ జన్మలోనే అనుభవించాలి, కానీ అనుభవించకముందే ఈ జన్మ ముగిస్తే, ఆ కర్మలను తర్వాతి జన్మలో అనుభవించాల్సి ఉంటుంది.

అలా మీరే మీ కర్మల ద్వారా జన్మలను పెంచుకుంటూ ఉంటారు. జన్మలేని స్థితికి దారి చూపించే గురువు మాటలను కూడా పట్టించుకోకపోవడం మీ అజ్ఞానం. మీలో ఇంకా తప్పులు జరుగుతున్నాయంటే, దానికి ప్రధాన కారణం ఆశ మరియు అసంతృప్తి. ఉన్నదానితో తృప్తి లేకపోవడం వల్ల మీ మనసు ఎప్పుడూ ఇంకేదో కోరుతూ ఉంటుంది; ఆ కోరికల వెంబడి నడుస్తూ మీరు తప్పు మార్గంలోకి వెళ్లిపోతారు.

ఇలా ఉన్నప్పుడు, మిమ్మల్ని ఎవరు మార్చగలరు? “నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి” అని శ్రీకృష్ణుల వారు భగవద్గీతలో చెప్పారు. కాబట్టి పాప కర్మలు చేయకుండా, మనల్ని మనమే కాపాడుకోవాలి. గురువు దారి చూపిస్తాడు, కానీ ఆ దారిలో నడవడం మాత్రం మీ బాధ్యత. కానీ ఆ దారిని వదిలి తప్పు మార్గంలో నడిస్తే, కర్మలు మరింత పెరుగుతాయి.

మీమీద మీకే జాలి లేకపోతే, భగవంతుడికి లేదా గురువుకి ఎందుకు

ఉంటుంది? భగవంతుడు ప్రతి మనిషికి ఎన్నో అవకాశాలు ఇస్తూనే ఉంటాడు.

భూమిపై పుట్టిన ప్రతి మనిషికి మోక్షం పొందే అర్హత ఉంది. మానవ జన్మ అంటే మోక్షాన్ని పొందడానికి, మరు జన్మ లేకుండా చేసుకోవడానికి. అటువంటి ఉత్తమమైన మానవ జన్మను పొంది, సద్గురువును పొందిన తర్వాత కూడా మోక్షం కోసం ప్రయత్నించకపోవడం అజ్ఞానం.

మీ పాపకర్మలు, దుష్ట సంస్కారాలు మిమ్మల్ని ముందుకు వెళ్ళనివ్వవు. మీలో దుష్ట సంస్కారాలు ఎక్కువగా ఉంటే, మోక్షం కోసం ప్రయత్నించరు. మీలో మంచి సంస్కారాలు ఉంటే, గురువు చెప్పిన మాట విని, సాధన చేసి, జ్ఞానం పొంది, మోక్షం కోసం ప్రయత్నిస్తారు. ఈ రెండింటికీ కారణం మీ సంస్కారాలే. దుష్ట సంస్కారాలు మిమ్మల్ని ప్రపంచం వైపు లాక్కెళ్తాయి. మంచి సంస్కారాలు మిమ్మల్ని పరమాత్మ వైపు నడిపిస్తాయి. దారి చూపేది గురువే, పరమాత్మను ఎలా చేరుకోవాలో గురువే భోదిస్తాడు.

ఆ దారి చెప్పడానికే సద్గురువులు మన జీవితంలోకి వస్తారు. గురువు లేకపోతే మీరు కళ్ళున్న గుడ్డివాళ్ళు. గురువు ఉంటే మీరు జ్ఞాన నేత్రం తెరుచుకుని, గొప్ప జ్ఞానులు అవుతారు. అనంతమైన శక్తి మీలోనే ఉందని గురువు రాకముందు మీకు తెలియదు.

ఆ శక్తిని వెలికి తీయడానికి మార్గం ధ్యానం. గురువు వచ్చిన తర్వాత ఈ సత్యం మీకు తెలుస్తుంది. ముందు మీరు డబ్బు సంపాదన గురించి మాత్రమే ఆలోచిస్తారు. కానీ గురువు వచ్చిన తర్వాత ఈ భూమిపైనే పరలోకానికి దారి తీసే సంపదను సంపాదించవచ్చు అని తెలుస్తుంది.

ఆ శక్తిని వెలికి తీయడానికి మార్గం ధ్యానం. గురువు వచ్చిన తర్వాత ఈ సత్యం మీకు స్పష్టంగా తెలుస్తుంది. ముందు మీరు డబ్బు సంపాదన గురించే ఎక్కువగా ఆలోచిస్తారు, అది జీవితానికి ముఖ్యమని భావిస్తారు. కానీ గురువు బోధ వల్ల మీకు అర్థమవుతుంది "ఈ భూమిపైనే ఉండి,

పరలోకానికి దారి తీసే నిజమైన సంపదను కూడా సంపాదించవచ్చు" అని. ఆ సంపద డబ్బు కాదు, అది జ్ఞానం, శాంతి, తృప్తి, ఆత్మానుభూతి. ఇవే మీతో పాటు నిలిచే నిజమైన ధనం.

అందుకే ధ్యానం ద్వారా మీ అంతరంగాన్ని తెలుసుకుంటూ, గురువు చూపించిన మార్గంలో నడిచినప్పుడు మాత్రమే మీ జీవితం బాహ్య సంపదతో పాటు ఆధ్యాత్మిక సంపదను పొందుతుంది.

ఆ సంపద జ్ఞానం. ఆ జ్ఞానాన్ని పొందడానికి మీరు చాలా జాగ్రత్తలు పాటించాలి. ఆహారంలో జాగ్రత్త, వ్యవహారంలో జాగ్రత్త అవసరం. ఎరుకతో కర్మలు చేస్తూ, మరుజన్మకు కారణమయ్యే కర్మలను మానాలి. మీరు మంచి పనులు తప్పకుండా చేయాలి. ఎందుకంటే మీ ప్రవర్తనను పరమాత్మ గమనిస్తాడు, కాబట్టి పుణ్య కర్మలు చేయాలి, కానీ ఆ పుణ్య కర్మలను నిష్కామకర్మగా చేయాలి, అంటే ఫలితాన్ని పరమాత్మకు అర్పించాలి.

"నేను చేస్తున్నాను" అనే భావం లేకుండా, "పరమాత్మ వల్లనే జరుగుతోంది" అని భావించాలి. అలా పుణ్యాన్ని కూడా అంటించుకోకుండా ఉంటే, జన్మ లేని స్థితికి చేరుకుంటారు. అహంకారంతో "నేనే చేస్తున్నాను" అని భావిస్తే, అది మరల జన్మకు కారణం అవుతుంది. గురువు చెప్పే విషయాలు సూక్ష్మమైనవి. అందువల్ల ప్రతి మాటను శ్రద్ధగా విని, ఆచరణలో పెట్టాలి. అలా చేస్తే ఈ జన్మ చివరి జన్మగా మారుతుంది.

మీలోని దైవత్వాన్ని తెలుసుకోవడం గురువు ద్వారానే సాధ్యం. కోటి ప్రయత్నాలు చేసినా, కోటి పుణ్య కర్మలు చేసినా మోక్షం రాదు, కోటి యజ్ఞాలు చేసినా మోక్షం రాదు. కానీ గురువు ఇచ్చిన ధ్యానం ద్వారా, సాధన ద్వారా పరమాత్మను చేరుకోవచ్చు. దానికి కావలసిన జ్ఞానం లభిస్తుంది, అలా మోక్షం వైపు ప్రయాణం మొదలవుతుంది. కోటి యజ్ఞాలు చేసినా రాని మోక్షం ధ్యానం ద్వారా లభిస్తుంది, ఈ మార్గం గురువు ద్వారానే లభిస్తుంది.

బాహ్య కర్మలు పుణ్య కర్మలే అవుతాయి, అవి మంచి ఫలితాలను ఇస్తాయి, అవి భోగవంతమైన జీవితం ఇస్తాయి, కానీ మోక్షం ఇవ్వవు.

సద్గురు వచ్చిన తర్వాత, పుణ్య కర్మలను కూడా నిష్కామంగా చేస్తూ, సాధన ద్వారా జ్ఞానం పొందాలి. అప్పుడు మాత్రమే దైవాన్ని తెలుసుకోగలరు. దైవాన్ని తెలుసుకునే ఏకైక మార్గం ధ్యాన సాధన. సాధన అంటే స్వయంగా సంపాదించిన ఆధ్యాత్మిక ధనం. ఈ సాధన ఎవరి జీవితంలో ఉంటుందో, వారు తప్పక పరమాత్మను చేరుకుంటారు.

సాధన చేసే ముందు "నేను ఎవరు?" అని తెలుసుకోవాలి. "నేను ఆత్మనే" అని గ్రహించాలి. "నేను పరమాత్మ నుంచి వచ్చాను" అని తెలుసుకోవాలి. "నేను ఎందుకు మానవ జన్మ తీసుకున్నాను?" అని విచారించాలి. "ఈ జన్మలోనే మరుజన్మ లేకుండా చేసుకోవాలి" అని నిర్ణయించుకోవాలి. ఈ దేహం ఉన్నప్పుడే, ఈ భూమిపైనే సాధన చేయాలి, అందుకే ఈ జన్మ వచ్చింది. ఈ ప్రపంచం, ఈ సంసారం ఇవన్నీ రుణానుబంధాలే, ఈ జన్మలోనే ఆ రుణాలను తీర్చుకోవాలి, ఇవి శాశ్వత బంధాలు కావు, భార్య, భర్త, పిల్లలు, బంధువులు వీరందరూ రుణ సంబంధాలే.

శాశ్వత బంధం ఒక్కటే భగవంతుడితో. ఎవరికి ఏ రుణం ఉందో, ఈ శరీరం ఉన్నప్పుడే తీర్చుకోవాలి. మీ దృష్టి ఎప్పుడూ పరమాత్మ మీద ఉండాలి. ఎందుకంటే ఎన్నో జన్మలు తీసుకున్నా, భగవంతుడిని ఇప్పటివరకు తెలుసుకోలేకపోయారు.

కనీసం ఈ జన్మలో సద్గురువు వచ్చినందుకు, సత్యాన్ని బోధించినందుకు, సాధన ఇచ్చినందుకు మీరు ఆ సాధనలో ప్రయత్నించాలి. కొత్త కర్మలు చేయకుండా జీవించాలి. ఎవరెవరికి ఎంత రుణం ఉందో, బాహ్యంగా అందరితో మంచిగా ఉండి ఆ బాధ్యతలను తీర్చాలి.

ఎవరికి ఏమి అవసరమో, అది మీరు చేయాలి. ఉదాహరణకు

“నేను ధ్యానం చేస్తాను, వంట చేయను” అని చెప్పడం సరికాదు. ఇంటి బాధ్యతలు, పిల్లల సంరక్షణ ఇవి మీ ధర్మం. భర్తగా, భార్యగా, తల్లిదండ్రులుగా ప్రతి పాత్రకు బాధ్యత ఉంది. సంసారాన్ని సక్రమంగా చూసుకోవాలి. సమాజంలో అందరితో స్నేహంగా జీవించాలి. అన్ని బాధ్యతలను నిర్వర్తిస్తూ, మీ దృష్టి పరమాత్మ మీద ఉండాలి.

అందుకే సద్గురువులు మీ జీవితంలోకి వస్తారు. కానీ వచ్చిన సద్గురువులను అందరూ గుర్తించలేరు. కొంతమంది పుణ్యాత్ములు మాత్రమే సద్గురువులను గుర్తించగలరు. అది కూడా గత జన్మలలోని మంచి సంస్కారాల వల్లే సాధ్యం. భూమిపై ఎన్నో అవతారాలు, మహాపురుషులు, జగద్గురువులు వచ్చారు. వారికీ శత్రువులు ఉన్నారు. ఆ శత్రువులు గత జన్మల పాప సంస్కారాల వల్ల వారిని గుర్తించలేక పోయారు.

అలాగే శిష్యులు గత జన్మల పుణ్య సంస్కారాల వల్ల గురువుకు దగ్గరగా ఉండి, జ్ఞానం పొందుతారు. వారు సాధన పూర్తి చేసి, మోక్షానికి చేరుకున్నారు. కొంతమంది భూమిపై ఉండి, తర్వాత తమ సాధన పూర్తి చేసుకుని వెళ్లారు.

అందుకే ప్రతి మనిషిని ముందుకు నడిపేది అతని సంస్కారమే. మీలో ఉన్న గత అనుభవాలు, వాసనలు, అభిరుచులు మీ దిశను నిర్ణయిస్తాయి. కొంతమంది ధ్యానం గురించి చెప్పినప్పుడు, “ఇంకా టైం ఉంది” అంటారు. అది వాళ్లలో మోక్షానికి తగిన సంస్కారం ఇంకా పొందలేదని సూచిస్తుంది. వాళ్ళు బాధపడుతూ, కష్టాలు అనుభవిస్తూ ఉన్నా, ధ్యానం చేయాలనే ఆసక్తి కలగదు, ఎందుకంటే వారి దృష్టి ఇంకా బాహ్య విషయాలపైనే నిలిచివుంటుంది.

అది వారి పాప సంస్కారాల ప్రభావం. వారు “మీరు మంచి పని చేస్తున్నారు” అంటారు, కానీ తాము ఆచరించలేరు. ఎందుకంటే ధ్యానం భగవంతుని చేరుకునే మార్గం. ఈ మార్గంలోకి రావడానికి పుణ్య సంస్కారాలు

అవసరం, పాప సంస్కారాలు ఉంటే ఈ మార్గంలోకి రాలేరు. సత్కర్మల ఫలితంగా వచ్చిన పుణ్యంతోనే ఈ మార్గంలోకి ప్రవేశిస్తారు.

అప్పుడే సత్యాన్ని తెలుసుకోగలరు. సద్గురువును అందరూ గుర్తించలేక పోవడానికి కారణం సంస్కారాలే. మీరు ఏ జన్మలో ఏ పుణ్యం చేశారో, ఆ ఫలితంగానే ఈ మార్గంలోకి వచ్చారు. మీరు సంసారం వదిలిపెట్టలేదు, సంసారంలోనే జీవిస్తున్నారు. కానీ ఇప్పుడు ఎలా జీవించాలో నేర్చుకున్నారు.

మీరు ఈ మార్గంలోకి రాకముందు “నాకు డబ్బు ఉంది, నాకు ఉద్యోగం ఉంది” అని అహంకారం ఉండేది. కానీ “అందరూ ఆత్మలే” అని గురువు చెప్పిన తర్వాత ఆ అహంకారం క్రమంగా తగ్గింది. ఇప్పుడు అందరితో స్నేహంగా, బాధ్యతలు నిర్వర్తిస్తూ, సాధనను కొనసాగిస్తూ జీవిస్తున్నారు.

ఈ ఆనందానికి మూలం గురువే. అందుకే సద్గురువుల అవసరం ప్రపంచానికి ఎప్పటికీ ఉంటుంది. ఆ అవసరం లేదని ఎవరూ అనుకోవద్దు. సద్గురువుల వల్లే సత్యం తెలుస్తుంది. ధర్మాన్ని ఆచరించే శక్తి వస్తుంది. సత్యం తెలియకపోతే, ధర్మం ఆచరించకపోతే మళ్ళీ పాప జీవితంలో పడిపోతారు.

సత్యం అంటే భగవంతుడు. ధర్మం అంటే ప్రతి జీవి సుఖంగా, ఆనందంగా జీవించేందుకు సహాయం చేయడం. భగవంతుడిపై అందరికీ భక్తి ఉంది, కానీ జీవులపై దయ ఉండాలి. ఈ మార్గంలోకి రాకముందు మీరు మాంసాహారం తిన్నారు. కానీ గురువు బోధించిన తర్వాత, జీవుల్ని హింసించకూడదని తెలుసుకున్నారు, మీరు కూడా ఎన్నో జన్మలలో అలాంటి జీవులుగా పుట్టి ఉండవచ్చు అని గ్రహించారు. మీ జన్మ లక్ష్యం జ్ఞానం పెంచుకోవడం. ఈ సత్యాన్ని గురువు నేర్పిన తర్వాత, మీ ధర్మాన్ని ఆచరిస్తున్నారు. సత్యం చెప్పడం, ధర్మం ఆచరణలో పెట్టడం ఈ రెండూ కలిగిన వాడు సాధన చేసి, జ్ఞానం పెంచుకుని, మోక్షానికి అర్హత పొందుతాడు. దానికి సద్గురువు అవసరం తప్పనిసరి. ప్రతి ఒక్కరికీ సద్గురువు అవసరం ఉంది. సద్గురువు ఉంటేనే జీవితం మారుతుంది.

# ఆధ్యాత్మిక జీవన విధానం

మీరందరూ ప్రతి రోజు సాధన చేస్తున్నారు, జ్ఞానం పొందుతున్నారు. ధ్యానం యొక్క అసలు ఉద్దేశ్యం ఏమిటంటే మీరు ఎవరో తెలుసుకోవడమే. మీరు ఎవరో మీకు ఇప్పటికే అర్థమైంది. అందరూ ఆత్మ స్వరూపులమని తెలుసుకున్నారు. అయినా కూడా, ఆత్మగా ప్రవర్తించ లేకపోవడానికి, ఆ స్థితిని అనుభవించ లేకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. అయితే ప్రధాన కారణం మనసే.

మీరు జీవితంలో ఎప్పుడూ హాయిగా, సుఖంగా, సంతోషంగా జీవించాలని కోరుకుంటారు. అలా జీవిస్తేనే అది గొప్ప జీవితం అని భావిస్తారు. అలా జీవించడం ప్రాపంచిక జీవితంలో గొప్పగానే భావిస్తారు . కానీ ఆధ్యాత్మిక జీవితంలో మరో ముఖ్యమైన విషయం ఆనందంతో ఉండాలి.

హాయిగా, సుఖంగా, సంతోషంగా ఉండటంతో పాటు, ఆనందం కూడా ఉండాలి. సాధారణంగా ప్రాపంచిక జీవితంలో సుఖం, సంతోషాన్ని ఆనందంగా భావిస్తారు. కానీ అసలైన ఆనందం ఆధ్యాత్మిక జీవితంలోనే ఉంటుంది. ఆధ్యాత్మిక జీవితానికి పునాది ప్రాపంచిక జీవితం. జీవితం ఒక చెట్టు అయితే, ఆధ్యాత్మిక జీవితం కనిపించని వేర్ల లాంటిది, ప్రాపంచిక జీవితం కనిపించే కొమ్మలు ఆకులు. అలాగే ఆ వేర్లు ఎలా ఉన్నాయో, అదే విధంగా మీ ఆధ్యాత్మిక జీవన విధానం ఉంటుంది.

మీ జీవన విధానాన్ని బట్టి మీరు గొప్పగా ఎదగగలరు. ఎన్నో విషయాల్లో, ఎన్నో సార్లు ఎలా జీవించాలి అని మనం చెప్పుకుంటూ ఉంటాం. అయినా కూడా, ఈరోజు ఇంకొన్ని విషయాలు మన జీవితంలో చెప్పుకోవాలి. చెప్పుకోకపోతే, "ఇది మాకు తెలియలేదు, పరిగణలోకి తీసుకోలేదు" అని అనిపించవచ్చు. లేకపోతే, గొప్ప గొప్ప ఉపమానాలు విని, "వాళ్ళు అలా

ఉన్నారు, వీళ్ళు అలా ఉన్నారు, వాళ్ళు సాధించారు మీరు కూడా సాధించగలరు" అని అనుకుంటారు. కాని అందరూ సాధించగలరు, కొందరు మాత్రమే త్వరగా, ఒకే జన్మలో పూర్తిగా సాధించి మోక్షాన్ని పొందగలరు.

కానీ మీ మనసులో మంచి లక్షణాలు లేకపోతే, అది సాధించడానికి కొన్ని జన్మలు పట్టవచ్చు. అందుకే గురువులు ఎప్పుడూ మీరు ఎలా ప్రవర్తించాలి? ఎలా ఉండాలి? అనే విషయాలను పదే పదే బోధిస్తారు. మహాత్ములు కూడా ఇదే విషయాన్ని మీకు తెలియజేస్తారు.

మీరు ఎన్ని ఉపనిషత్తులు చదివినా, అవన్నీ కూడా "ఆత్మే పరమాత్మ" అని చెబుతాయి. అయినా కూడా అది తెలుసుకోలేకపోవడానికి కారణం మీ చంచలమైన బుద్ధి. ఎన్ని పుస్తకాలు చదివినా "ఆత్మే పరమాత్మ" అనే సత్యాన్ని మర్చిపోకుండా ఉండేందుకు ఉపనిషత్తులు మీకు సహాయపడతాయి.

అలాగే, మీ ప్రవర్తన ఎలా ఉంటే  ఎదుగుతారో చెప్పడానికి, మీకు తెలియని విషయాలను తెలియజేయడానికి, ఈ ఆధ్యాత్మిక పుస్తకాలు మీరు చదవడానికి అవకాశం లభించింది. ఇలా స్వాధ్యాయం చేస్తూ ఉండాలని గురువుగారు మిమ్మల్ని ప్రోత్సహించారు.

ఎందుకంటే? మీరు క్లాసులో విన్నది కొద్దిగా మాత్రమే, కానీ స్వాధ్యాయం ద్వారా మీరు ఎంతో జ్ఞానాన్ని పొందగలరు అని పత్రి గారు చాలా స్పష్టంగా "స్వాధ్యాయం" అని చెప్పారు. మీ స్వాధ్యాయమే మీరు పొందిన జ్ఞానాన్ని తెలియజేస్తుంది.

ఎక్కడ సత్యం ఉంది? ఎక్కడ ధర్మం ఉంది? ఏ పుస్తకంలో అది తెలుస్తుంది? అనేది నిరంతర అన్వేషణ చేసినప్పుడు, మీకు ఆత్మపై ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుంది. అలాగే, చదివి నేర్చుకున్న తర్వాత మీకు జ్ఞానంపై ఎంత శ్రద్ధ ఉందో కూడా తెలుస్తుంది. మీకు భగవంతుడిపై భక్తి ఉండాలి, అలాగే శ్రద్ధతో ప్రయత్నం కూడా చెయ్యాలి.

ఈ రెండూ ఉన్నప్పుడే మీరు జీవితంలో అన్నీ సాధించగలరు. భగవంతుడిపై భక్తి లేకుండా, మీ ప్రయత్నంలో శ్రద్ధ లేకుండా ఏదీ సాధించలేరు. అందుకే ఇవన్నీ ఎందుకు తెలుసుకోవాలంటే? మీలో ఎక్కడ లోపం వుందో గుర్తించడానికి ఈ విషయాలను మీరు పదేపదే మననం చేసుకుంటూ ఉండాలి. ఎందుకంటే, హాయిగా ఉండాలని ప్రతి వ్యక్తి ఎప్పుడూ కోరుకుంటాడు.

జీవితంలో చిన్న కష్టం వచ్చినా చాలా మంది "శాంతి లేదు, హాయి లేదు, సుఖం లేదు" అని అంటారు. అలా ఎందుకు లేదో ఒక్కసారి విచారణ చేసుకుంటే, మహాత్ములు చెప్పిన విషయం గుర్తుకు వస్తుంది "నువ్వు హాయిగా లేవు అంటే, ఎదుటి వాడిని హాయిగా ఉండనివ్వట్లేదు" అని.

సృష్టి ధర్మం ఏమిటంటే? నువ్వు సృష్టికి ఏది ఇస్తావో అదే నువ్వు పొందుతావు అని మన గురువుగారు ఎన్నో సందర్భాల్లో చెప్పారు. సృష్టికి నువ్వు ఇచ్చిందే, సృష్టి నుంచి తిరిగి పొందుతావు. సృష్టి అంటే అందులో ఉన్న అన్ని లోకాలు, అన్ని జీవులు, మీ కుటుంబ సభ్యులు కూడా సృష్టిలో ఒక భాగమే.

మీరు ఎప్పుడూ ప్రేమ కోరుకుంటారు; ప్రేమ కావాలి అనుకుంటారు. అలాగే హాయిగా ఉండాలని కోరుకుంటారు, కానీ ఇతరులను, ఇతర జీవులను హాయిగా ఉండనివ్వరు. కాని ఇతరులను హాయిగా ఉండనిస్తే, మీరు కూడా హాయిగా జీవించగలరు.

మీ నోరుకు ఖర్చు లేని పని కాబట్టి, ఏదో ఒకటి మాట్లాడి ఇతరులను బాధపెడతారు; తరువాత బాధపడతారు. అందుకే మహాత్ములు మౌనం మానవుడికి గొప్ప వరమని చెప్పారు; ఎందుకంటే? శక్తి కర్చు కాదు, కొత్త కర్మలు రావు.

కానీ ప్రతి క్షణం భగవంతుడు మనల్ని గమనిస్తున్నాడనే ఎరుక ఉంటే ఇలా ప్రవర్తించరు. అందుకే ఎదుటివారిని హాయిగా ఉండనిస్తే, మీరు

కూడా హాయిగా ఉంటారు.

అలాగే మీరు సుఖంగా ఉండాలంటే ఎదుటివారిని సుఖంగా ఉండనివ్వాలి. వాళ్ళను సుఖంగా ఉండనివ్వకపోతే, మీకు సుఖం రాదు.

బయట ప్రపంచంలో జరుగుతున్న విషయాలను ఎక్కువగా చూడటం, వినడం వల్ల కళ్ళ ద్వారా, చెవుల ద్వారా మనసు చెడు ప్రభావానికి లోనవుతుంది. అందుకే ఆధ్యాత్మిక విషయాలను వినడం చాలా అవసరం. గురువుగారి దగ్గరకు వచ్చిన తర్వాత నేర్చుకున్నది, చేప పిల్లకైనా బాధ కలిగించకూడదు, హింస చేయకూడదు.

హింస అంటే కేవలం మాంసం తినడం మానడం కాదు; మాటల ద్వారా, చేతల ద్వారా కూడా ఎవరికీ బాధ కలిగించకూడదు. అందుచేత ఎవరినీ బాధ పెట్టకుండా ఉండటానికి ప్రయత్నించాలి. “నేను ఏం తప్పు చేస్తున్నాను?” అని ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు తమను తాము విచారణ చేసుకుంటే, ఎక్కడైనా తప్పు చేస్తున్నా అర్థమవుతుంది.

మీరు ఎక్కువగా మాట్లాడేటప్పుడు మీ ఎరుకను కోల్పోతూ ఉంటారు. దానివల్ల గురువులు చెప్పిన విషయాలు మీ స్మృతిలో నిలవవు, మీరు చెత్త విషయాలను పోగేస్తూ మంచి విషయాలు లేకుండా పోతాయి.

అందుకే పూర్వకాలంలో మహాత్ములు వారి దృష్టి పరమాత్మపై నుంచి పరులపైకి మళ్ళిపోతుందేమో నని జనానికి దూరంగా వెళ్ళేవారు; కానీ ఇప్పుడు జనాలకి దూరంగా వెళ్ళడం సాధ్యం కాదు. అందుకే పత్రిగారు “సంసారంలోనే నిర్వాణం” అనే మార్గాన్ని చూపించారు. అందుకే మీరు ఎక్కడికీ వెళ్ళాల్సిన అవసరం లేదు; ఇంట్లోనే ఉండి ప్రయత్నిస్తే సరిపోతుంది.

మీరు ప్రాపంచిక విషయాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల, ఆధ్యాత్మిక విషయాల్లో వెనుకబడిపోతారు. అలా వెనుకబడితే, “ఇన్ని రోజులు నుంచి ధ్యానం చేస్తున్నాను, ఇన్ని రోజులు నుంచి క్లాసులు వింటున్నాను,

కానీ  చెప్పలేకపోతున్నాను, మాట్లాడలేకపోతున్నాను” అని అంటారు.

అందుచేత దానికి కారణం వేరెవరో కాదు మీరే. ప్రాపంచిక విషయాల్లో మీరు ఎలా ఉన్నారో విచారణ చేసుకుంటే, మీరు దేనికి ప్రాధాన్యత ఇస్తున్నారో తెలుస్తుంది. చుట్టాలు పిలిస్తే వెళ్లకపోతే బాగోదు అని అనుకుని సంసార విషయాలకే ప్రాముఖ్యం ఇస్తుంటారు. కాని ఆధ్యాత్మికంగా లోపం వస్తుందేమో ననే భయం ఉంటే, ఈ ప్రాపంచిక విషయాల నుంచి కొంత దూరంగా వుంటారు.

ఎందుకంటే? చిన్న లాభం కోసం వెళ్ళి పెద్ద నష్టం పొందుతారు. చిన్న లాభం  మీవాళ్ళను కలిసిన ఆనందం. కానీ పెద్ద నష్టం  ఆధ్యాత్మికంలో ఎదగక పోవడం. ఇది గమనిస్తే, వాటి నుంచి దూరంగా ఉండగలుగుతారు. కాని అత్యవసరం అయితే వెళ్ళి వెంటనే వచ్చేయాలి.

అందుకే ప్రాపంచకానికి కొంచెం దూరంగా ఉంటే, ఆధ్యాత్మికంగా ముందుకు వెళ్తారు. ముందుకు వెళ్తున్న కొద్దీ మీకు ఆనందం పెరుగుతుంది. మీకు నిజంగా ఆనందం కావాలంటే, ఆధ్యాత్మికతలో ముందుండాలి. అంటే సాధనలో, స్వాధ్యాయంలో, క్లాసులు చెప్పడంలో ముందుండాలి అనే కోరికలు పెంచుకోవాలి.

మనసులో ఏ కోరిక పెడతారో, దానికి అనుగుణంగా మీరు ప్రయత్నం చేస్తారు. ఉదాహరణకు, ఈరోజు  వంట చేయాలని అనుకుంటే, దానికోసమే ప్రయత్నం చేస్తారు. అలాగే ప్రాపంచికం అయినా, ఆధ్యాత్మికత అయినా  మనసులో ఏ కోరిక ఉంటే దానికోసమే ప్రయత్నిస్తారు.

మనసులో ధ్యానం చేయాలనే కోరిక ఉంటే, ధ్యానం చేస్తారు, జ్ఞానం పొందాలని కోరిక ఉంటే, నిరంతరం స్వాధ్యాయం చేస్తూ కొత్త విషయాలు తెలుసుకుంటాంరు. మీరు ఒక పుస్తకం చదివి ప్రక్కన పెట్టకుండా, మళ్ళీ మళ్ళీ చదివితే ప్రతి సారి కొత్త విషయాలు తెలుస్తాయి. అందుచేత పుస్తకాలు

చదివేసి వదిలేయడం కాదు; మళ్ళీ మళ్ళీ పునఃశ్చరణ చేయాలి.

అలా ఆధ్యాత్మికతలో ముందుకు వెళ్తే, అంతులేని ఆనందాన్ని పొందుతారు. ఈరోజు చాలా మంది "ఈ వయసులో కూడా మీరు ఇలా ఎలా చురుకుగా ఉంటున్నారు?" అని అడుగుతారు. నేను స్టేజ్ మీద కూర్చున్నా లేకపోయినా నా దైనందిన జీవితంలో నేను నా వయస్సును కూడా గుర్తించను.

నేను నిరంతరం ఏ కొత్త సబ్జెక్ట్ చెప్పాలో అని పుస్తకాలు తిరగేస్తూ కూర్చుంటాను. మైండ్ అలసిపోయినట్లు అనిపిస్తే వెంటనే కూర్చుని ధ్యానం చేసి రిలాక్స్ అవుతాను; ఆ సమయంలో ఇతర పనులు చేయను. విశ్రాంతి కావాలంటే అరగంట లేదా పావుగంట ధ్యానం చేస్తే సరిపోతుంది. అప్పుడు పుస్తకాన్ని ఫ్రెష్‌గా చదవగలను. ఈ రొటీన్ లైఫ్ వల్ల మా ఇద్దరికీ కూడా మా వయస్సు గుర్తుకు రాదు, ఎందుకంటే దాని మీద దృష్టి ఉండదు కాబట్టి.

చేయాలి, చెప్పాలి, వెళ్ళాలి అనే దృష్టిలో ఉండటం వల్ల వయస్సు స్మృతిలోకి రాదు. మీకు జ్ఞానం తక్కువగా ఉన్నప్పుడు భయం ఎక్కువగా ఉంటుంది. ప్రాపంచిక విషయాల గురించి అయితే అందరూ అనర్గళంగా మాట్లాడతారు. కానీ ఆధ్యాత్మిక విషయాల వద్దకు రాగానే "మైక్ పట్టుకోవడం భయం" అంటారు. అది ఎందుకు వస్తుందంటే -- జ్ఞానం తక్కువగా ఉందని భావించడం వల్ల.

మీలో జ్ఞానం పెరిగితే "నేను చెప్పలేనేమో" అనే భయం ఉండదు. ప్రాపంచిక విషయాలు అయితే కొత్తవాళ్ళ దగ్గర కూడా మీరు నిర్భయంగా మాట్లాడుతారు. అయితే ఇన్ని సంవత్సరాలుగా నేర్చుకున్న ఆధ్యాత్మిక విషయాలను ఎందుకు చెప్పలేరు? అంటే భయం, ఆ విషయాలపై సరైన పరిచయం లేకపోవడం, ఏదైనా తప్పుగా చెప్తే ఏమనుకుంటారో అనే భయం కూడా ఉంటుంది.

మీరు ఎన్నో సబ్జెక్టులు వింటున్నారు; అందులో ఏదో ఒకటి

ఎంచుకుని చెప్పవచ్చు. ముందుగానే "నన్ను పిలిస్తే నేను ఏదో ఒకటి చెప్పగలను" అని మీ మనసుకు ధైర్యం ఇవ్వాలి. అలా చేస్తే భయం తగ్గిపోతుంది. రోజూ భయాన్ని ఆహ్వానించకుండా, ధైర్యాన్ని ఆహ్వానించాలి. ప్రాపంచిక విషయాల్లో అయితే కొత్తవాళ్ళతో కూడా సులభంగా మాట్లాడుతారు. "మీ పిల్లలు ఎంతమంది?", "పెళ్లి అయ్యిందా?", "ఉద్యోగం వచ్చిందా?" వంటి విషయాలు సులభంగా మాట్లాడేస్తారు. అయితే ఆధ్యాత్మిక విషయాల వద్దకు రాగానే ఎందుకు భయం వస్తుంది?

మీకు గుణాలు, పంచకోశాలు, మనసు, బుద్ధి వంటి ఎన్నో విషయాలు తెలుసు. అయినా అవి స్మృతిలో ఉండకపోవడానికి కారణం ప్రాపంచిక విషయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం. దాంతో ఆధ్యాత్మిక విషయాలు వెనుకకు వెళ్ళిపోతాయి. ఆ తర్వాత "నేను చెప్పలేను" అనే బాధ వస్తుంది.

అందుకే "నాకు తెలియదు" అనకుండా, "నేను ఎన్నో నేర్చుకున్నాను" అని అనుకోవాలి. ఎన్నో సంవత్సరాలుగా మీరు క్లాసులు విన్నారు, జూమ్‌లో పాల్గొన్నారు, పుస్తకాలు చదివారు. కానీ చదివిన, వ్రాసుకున్న పుస్తకాలను మళ్లీ చదవాలి.

అప్పుడు మీకు అన్నీ గుర్తుకు వస్తాయి. ప్రాపంచిక విషయాల్లో మాట్లాడుతున్నట్లే, ఆధ్యాత్మిక విషయాల్లో కూడా మాట్లాడగలగడానికి ప్రయత్నించాలి. ప్రయత్నం చేయకపోతే ఎప్పటికీ ఏదీ సాధించలేరు. ఒక్క అడుగు వేయడానికి ధైర్యం చేస్తే, తర్వాత ఎన్నో అడుగులు వేయగలరు.

ఇంకో విషయం ఎప్పుడూ పరమాత్మకు, గురువుకు, ప్రకృతికి, ప్రతి ఒక్కరికీ వినయంగా ఉండడం నేర్చుకోవాలి. వినయం ఉన్నప్పుడే ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం వస్తాయి. అవి వచ్చినప్పుడు ఆజ్ఞాపించే శక్తి సహజంగా వస్తుంది. ముందుగా వినయం నేర్చుకుంటే, తరువాత మానవుడు జ్ఞానంలో

పరిపక్వత పొందుతాడు, అప్పుడు ఇతరులకు చెప్పగలిగే శక్తి కలుగుతుంది.

పత్రి గారికి ధనం లేకపోయినా, ఆయన జ్ఞానం వల్ల మనమందరం ఆయనకు నమస్కరిస్తున్నాం. ఆ జ్ఞానం వల్లే ఆయన శక్తివంతుడయ్యారు. శక్తి వేరు, బలం వేరు; తిండి వల్ల బలం వస్తుంది, కానీ ధ్యానం మరియు జ్ఞానం వల్ల శక్తి వస్తుంది. ఎవరినైనా ప్రభావితం చేసే శక్తి మానవుడికి జ్ఞానం ఉన్నప్పుడు వస్తుంది.

ఆ జ్ఞానం సాధన ద్వారా వస్తుంది. మనసును శాంతంగా ఉంచి, బుద్ధితో జ్ఞానాన్ని గ్రహించి, దానిలో పక్వత పొందితే ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పొందుతారు. అప్పుడు ప్రపంచాన్ని ప్రభావితం చేసే శక్తి కలుగుతుంది. అందుకే జగద్గురువులు జ్ఞానంలో పక్వత పొంది ప్రపంచాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నారు.

వాళ్ళను ఆదర్శంగా తీసుకుంటే, వారు ఎందుకు గొప్పవారయ్యారో అర్థమవుతుంది. వారు తమ మనసును ఎప్పుడూ శుద్ధంగా ఉంచుకున్నారు. ఆ శుద్ధత ఎలా వచ్చిందంటే -- విశ్వకళ్యాణం కోసం కృషి చేయడం వల్ల. వారి మనసులో అవినీతి, దుర్గుణాలు, అపవిత్రత ఉండకుండా చూసుకున్నారు.

భగవంతుడు మెచ్చే విధంగా వారు ప్రవర్తించారు. దాంతో వారి మనసు పూర్తిగా శుద్ధమైంది. అది క్రిస్టల్‌లా నిర్మలంగా మారింది. అందుకే వారు జ్ఞానంలో పరిపక్వత పొంది, ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పొందారు. అది వచ్చినప్పుడు సర్వాత్మ భావన కలుగుతుంది.

అప్పుడు సృష్టి అంతా ఆత్మమయం అన్న దృష్టి కలుగుతుంది. ఆ దృష్టి వల్ల విశ్వకళ్యాణం కోసం పని చేసే శక్తి వస్తుంది. అందుకే వారు మనకు ఆదర్శమూర్తులయ్యారు. ఆచరించినవారే ఆజ్ఞాపించే శక్తి పొందుతారు, ఆచరణ లేకుండా ఆజ్ఞాపించే శక్తి రాదు. వారంతా ముందుగా దుర్గుణాలను తొలగించి, సాధన ద్వారా స్థిరమైన మనసు పొందారు.

అప్పుడు వారికి వాసనలు, కోరికలు ఉండవు. ఏది చూసినా "అన్నీ నేనే" అనే భావన వస్తుంది. అప్పుడు చంచలత్వం ఉండదు. సర్వం నేనే అనే సర్వాత్మ భావన వచ్చినవాడు సృష్టిని ప్రభావితం చేసే శక్తివంతుడవుతాడు. ఎవరు జ్ఞానవంతులు అవుతారో, ప్రకృతి వారికి సహకరిస్తుంది.

మరి అంత శక్తి ఉన్నప్పుడు మనకు సుఖమే కాదు, సంతోషమే కాదు, ఆనందం కూడా మనదే అవుతుంది. ఈ విధంగా చంచలమైన మనసులో ఉన్న మానవుడు ఆనంద స్వరూపుడిగా మారడానికి ఈ సాధన, ఈ జ్ఞానం అవసరం. మనం ఇంత సాధన ఎందుకు చేస్తున్నామంటే -- ఇంకా తక్కువే చేస్తున్నామనే భావన ఉండాలి.

ఎందుకంటే ప్రాపంచిక జీవితంలో మనం ఎంత సమయం గడుపుతున్నామో, ఆధ్యాత్మిక జీవితంలో అంత సమయం గడపడం లేదు. ఈ రెండింటిని వేరుగా చూసుకుంటే, ఇవి రివర్స్ కావాలి. అవసరమైనంత వరకు మాత్రమే ప్రాపంచిక జీవితంలో ఉండి, అవసరం తీరిన తర్వాత ఆధ్యాత్మిక జీవితంలో గడపగలగాలి.

అలా గడపగలిగిన రోజున, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతకు మొదటి ప్రాధాన్యత ఇస్తే, మీరు కూడా ఆదర్శమూర్తులవ్వచ్చు. అప్పుడు మీరు కూడా ఒక ఆది శంకరాచార్యులు, ఒక గౌతమ బుద్ధుడు, ఒక పత్రిగారు, ఒక మలయాళ స్వామిలా గొప్పవారిగా మారగలరు.

అలాంటి అవకాశం అందరికీ ఉంది. భగవంతుడు అందరికీ 24 గంటలు ఇచ్చాడు. కానీ మీరు ఎక్కువ సమయం ప్రాపంచిక జీవితంలో గడుపుతూ, కొద్ది సమయం మాత్రమే ఆధ్యాత్మికతకు కేటాయిస్తున్నారు. అందుకే వారు అంత సాధించారు, మీరు ఇంకా సాధించ లేకపోతున్నారు. అయితే ఇప్పుడు మీకు దీని గొప్పతనం అర్థమవుతోంది.

మనసు ప్రపంచంలో ఉన్న అన్ని విషయాలను కోరుకుంటుంది.

కానీ అవన్నీ ఎలా పొందాలో తెలియదు, అవి పొందడానికి మార్గం సాధన మాత్రమే. సాధన ద్వారా జ్ఞానం వస్తుంది. జ్ఞానం వచ్చినప్పుడు నువ్వు అనుకున్నవన్నీ సాధించగలవు. ప్రపంచమే నీ ముందర వంగిపోతుంది.

నువ్వు పూర్ణజ్ఞానివైతే, అన్నీ నీ చేతులలోనే ఉంటాయి. నువ్వే దైవం, ఆత్మస్వరూపుడివి. దైవం అనేది వేరే కాదు; అది నువ్వే. సంపాదించే శక్తి నీలోనే ఉంది. కానీ సంపాదించడాన్ని మర్చిపోయి, కేవలం కోరుకుంటూ ఉంటావు. కోరుకుంటే రాదు; సంపాదిస్తేనే వస్తుంది. ఈ సంపాదన సాధన ద్వారా, జ్ఞానం ద్వారా పొందగలరు.

ఏం చేస్తే రాదో తెలుసుకున్నప్పుడు, మీ దృష్టి సాధన మీద, జ్ఞానం మీద ఉంటుంది; కోరికల మీద కాదు. ఉదాహరణకు, నీ ముందు ఆహారం ఉంటే తినవచ్చు. కానీ తీసుకుని తినడానికి కూడా ప్రయత్నం చేయకపోతే, ఎవ్వరూ సహాయం చేయలేరు. ఇదీ అలాగే విశ్వంలో అనంతమైన శక్తి, అనంతమైన జ్ఞానం ఉన్నాయి. వాటిని పొందడానికి మనిషి తన ప్రయత్నం, తన శ్రద్ధ ఆధారంగా ముందుకు రావాలి. ఇక్కడ శ్రద్ధ ఉండాలి, ప్రయత్నం ఉండాలి.

ప్రయత్నం లేనివాడు ఏదీ సాధించలేడు. ప్రయత్నశీలుడు ఏదైనా సాధించగలడు. మీరు ప్రయత్నం చేస్తే ఏదైనా సాధించగలము అని తెలుసుకున్నారు. సాధించాలంటే సాధన తప్పనిసరి. ఇది తెలుసుకోవడమే కాదు; మీ జీవితంలో ఆచరించాలి, మరియు ఇతరుల చేత కూడా ఆచరింప చేయడం మీ జీవిత లక్ష్యం.

సరైన ఆత్మజ్ఞానాన్ని స్వీకరించే శక్తి ఇంకా మీలో పూర్తిగా అభివృద్ధి కాలేదు. ఈ లోపానికి ప్రధాన కారణం ఏమిటంటే మీరు సాధనలో ఇంకా అనుకున్న స్థాయికి చేరుకోలేదు. మీరు ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారు, జ్ఞానానికి సంబంధించిన విషయాలు వింటున్నారు, నేర్చుకుంటున్నారు కానీ

అవి ఆచరణలోకి వచ్చేటప్పుడు గందరగోళంగా అనిపిస్తుంది. అవి నిజంగా అలవాటవుతాయా? లేదా? అనే సందేహం మీకు వస్తుంది.

ఇలా ఎందుకు జరుగుతుంది అంటే, మహాత్ములు చెప్పిన ఒక ముఖ్యమైన కారణం ఉంది "మితిమీరిన బంధమే మనస్తాపానికి కారణం." బంధాలు లేవు అని చెప్పలేం. కానీ అవి మితిమీరితే, ఏ విషయంలోనూ పూర్తిగా విజయాన్ని సాధించలేరు. ప్రతి మనిషికి బంధం ఉండటమే సహజం. అది ఇలా ఉండవచ్చు సంఘంతో బంధం, కుటుంబ (సంసార) బంధం, ఉద్యోగం లేదా వ్యాపారం, ఆస్తి, సంపద, పదవి, గౌరవం అన్ని బంధాలతో ఉన్న మనిషికి, భగవంతుడితో సంపూర్ణ బంధం ఏర్పరచుకునేంత ఖాళీ, లేదా అంతర్గత స్వేచ్ఛ ఉండదు, ఆసక్తి కూడా తగ్గిపోతుంది.

మనిషి స్వభావం ఏమిటంటే ఎన్ని ఉన్నా సరే "ఇంకా కావాలి" అనే భావనతోనే ఉంటాడు. ఇదే అతిపెద్ద బంధం. మీరు చేస్తున్న ప్రతి పనిని గమనిస్తే మీకు ఒకేసారి రెండు కావాలి ఆత్మజ్ఞానం, ప్రాపంచిక సుఖాలు.

కానీ ఈ రెండింటినీ సమానంగా, పూర్తిగా పొందాలాంటే, పూర్ణమైన ఆత్మజ్ఞానం పొందే అవకాశం చాలా తగ్గిపోతుంది. అందుకే మీరు ఎప్పుడూ కనీసం 50% ప్రాపంచిక జీవితం, 50% ఆధ్యాత్మిక జీవితం ఉండేలా ప్రయత్నించాలి. కానీ వాస్తవానికి ఏమవుతోంది అంటే ఈ ప్రాపంచిక బంధాల వల్ల ఆత్మజ్ఞానం వైపు 50% వరకు కూడా చేరుకోలేకపోతున్నారు. ఇదే సమస్త భయాలకు, సమస్త దుఃఖాలకు ప్రధాన కారణం.

మీ జీవితంలో ఆత్మజ్ఞానం పొందనివ్వకుండా అడ్డుకునే ప్రధానమైన రెండు కారణాలు. 1) బంధాలు, 2) ప్రాపంచిక విషయాల మీద వ్యామోహం. ఈ రెండూ ఉన్నంత వరకు మీకు ఆత్మజ్ఞానం సులభంగా కలగదు. మీలో అంతర్గతంగా ఒక మంచి కోరిక ఉంటుంది "ఎంతో నేర్చుకోవాలి, ఎంతో సాధించాలి" అనే తపన ఉంటుంది. అది లేకపోతే మీరు ఈ ఆధ్యాత్మిక

మార్గంలోకి రావడమే జరగదు. కానీ ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే కోరిక ఉన్నా, దాన్ని సాధించలేకపోవడానికి కారణం బాహ్యమైన బంధాలే అని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి.

ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకునేందుకు ఒక మంచి ఉదాహరణ ఉంది. ఒకసారి బొంబాయి నుంచి ఒక ధనిక వ్యాపారి బాబాగారి దగ్గరకు వచ్చాడు. అతనికి చాలా సంపద ఉంది. “బాబాగారు ఆత్మజ్ఞానం బాగా బోధిస్తారు, ఆయన దగ్గరకు వెళ్తే నేర్చుకోగలను” అని అతను విన్నాడు. అలా అనుకుని ఆయన బండి మీద వచ్చాడు, తిరిగి అదే బండి మీద వెళ్ళాలనే ఆలోచనతో దాన్ని ప్రక్కన పెట్టి కూర్చున్నాడు. మహాత్ములకు మన మనసు తెలుసు; అతను వచ్చి బాబాగారితో, “మీరు ఆత్మజ్ఞానం బోధిస్తారని విన్నాను, నాకు బోధించండి” అని అడిగాడు.

అప్పుడు బాబాగారు సంతోషంగా, “నాయనా, నీకు ఆత్మజ్ఞానం మీద ఆసక్తి కలిగింది అంటే చాలా సంతోషం. చెప్తాను, కాసేపు కూర్చో” అన్నారు. తర్వాత ఒక చిన్నపిల్లవాడిని పిలిచి, “ఫలానా వ్యక్తి దగ్గరకు వెళ్లి ఐదు రూపాయలు తీసుకురా” అని పంపారు. ఆ పిల్లవాడు వెళ్ళి “లేవు” అని వచ్చాడు. మళ్ళీ మరో చోటికి పంపారు, అక్కడ కూడా లేవు అన్నాడు. ఇలా రెండు మూడు చోట్లకు పంపినా డబ్బు దొరకలేదు.

ఇంతలో ఆ వ్యాపారికి ఆత్రం మొదలైంది “నేను బండి మాట్లాడుకుని వచ్చాను... ఆలస్యమైతే బాడుగ ఎక్కువ అడుగుతాడు” అని మనసులో ఆలోచిస్తూ ఉండిపోయాడు. అతను అసహనంగా కూర్చుని, బాబాగారిని తొందరపెట్టడం ప్రారంభించాడు. ఇంకా ఆ వ్యాపారి అసహనంతో, “బాబా, నాకు చెప్పాల్సినది చెప్పండి, నేను వెళ్ళిపోతాను” అని అన్నాడు.

అప్పుడు బాబాగారు చిరునవ్వుతో చెప్పారు, “నాయనా, నీ జేబులో చాలా డబ్బు ఉంది. నేను ఈ చిన్న పిల్లవాడిని మూడు చోట్లకు ఐదు రూపాయల

కోసం పంపిస్తున్నాను, నువ్వు చూస్తూనే ఉన్నావు. కానీ నీ దగ్గర ఉన్న ఐదు రూపాయలు కూడా తీసి ఇవ్వలేకపోయావు. అయితే చెప్పు ఐదు రూపాయలు కూడా ఇవ్వలేని నీకు ఆత్మజ్ఞానం పొందే అర్హత ఉందా? నీకు సంపద మీద బంధం ఉంది, డబ్బు మీద బంధం ఉంది. అంతేకాదు, నువ్వు ఇక్కడ కూడా ఆ బండి గురించి ఆలోచిస్తూ, 'లేట్ అయితే డబ్బు ఎక్కువ అడుగుతాడు' అని నన్ను తొందరపెడుతున్నావు. ఇలాంటి మనస్తత్వం ఉన్నవారికి ఆత్మజ్ఞానం చెప్పినా అర్థం కాదు, అర్థమయినా దాన్ని నిలుపుకోలేరు." అన్నారు.

ఈ బోధ ద్వారా మీరు అర్థం చేసుకోవాల్సిన విషయం త్యాగభావం లేకుండా, వదులుకునే ధైర్యం లేకుండా పూర్ణమైన జ్ఞానం పొందడం అసాధ్యం.

అయితే ఇక్కడ ఒక సందేహం వస్తుంది "అన్నీ వదిలేస్తే మీ జీవితం ఎలా నడుస్తుంది?" అని అనిపించవచ్చు. దానికి సమాధానం అన్నీ వదిలేయమని కాదు, ఉద్యోగం చేయాలి, వ్యాపారం చేయాలి, ఇంటి పనులు చేయాలి. కానీ ఏ పని చేసినా ఆత్మజ్ఞానం పొందాలనే కోరిక మాత్రం మనసులో బలంగా ఉండాలి. ఆ కోరిక బలంగా ఉంటే, తప్పకుండా సాధించగలరు.

ఇప్పుడు సరిదిద్దుకోవాల్సిన విషయాలు ఏమిటంటే? బంధాలు మాత్రమే కాదు, మీలో ఉన్న అరిషడ్వర్గాలు కూడా ఆత్మజ్ఞానానికి పెద్ద ఆటంకం. వీటి గురించి ఆది శంకరాచార్యులు కూడా స్పష్టంగా చెప్పారు. మీకు ఈ అరిషడ్వర్గాలు ఉన్నాయనే విషయం కూడా  తెలియదు. కానీ అవి ఉన్నంత వరకు మీరు ఆత్మజ్ఞానం పొందలేరు.

అరిషడ్వర్గాల్లో ప్రధానమైనవి కామం (కోరిక) , క్రోధం (కోపం), మోహం (అతిగా ఆసక్తి) ఈ మూడు మనిషిని ఎక్కువగా దిగజార్చే గుణాలు. ఇవి మత్తుమందులు లాంటివి, మొదట్లో ఆనందంగా అనిపిస్తాయి. కానీ అలవాటు చేసుకుంటే పూర్తిగా నాశనం చేస్తాయి.

మొదట కోరిక పుడుతుంది, అది తీరకపోతే కోపం (క్రోధం) వస్తుంది,

కోరిక పెరిగితే మోహం పెరుగుతుంది. చివరకు ఇవి మనిషిని అగాధంలోకి నెట్టేస్తాయి.

ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి ఎక్కువగా ఉన్నవారికి, ఎంత ఆధ్యాత్మిక జ్ఞానం విన్నా అది లోపలికి దిగదు. మీరు ఎప్పుడూ వింటూనే ఉంటారు, కానీ వాస్తవానికి మీరు అవసరంలేని విషయాల మీద ఎక్కువగా దృష్టిపెడతారు.

మీకు అవసరం లేని విషయాలు చాలా బాగా గుర్తుంటాయి. ఎవరు ఏమి మాట్లాడినా, ఎక్కడో జరిగిన చిన్న సంఘటన, ఇతరుల గురించి అనవసరమైన వివరాలు ఇవి అన్నీ బాగా గుర్తుంటాయి.

కానీ ఆత్మజ్ఞానానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలు మాత్రం మర్చిపోతారు. దీని అర్థం మీరు ప్రాపంచిక విషయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, ఆధ్యాత్మిక విషయాలను నిర్లక్ష్యం చేస్తున్నారు.

మీరు ప్రాపంచిక విషయాల మీద ఎంతగా ఆసక్తి పెంచుకుంటారో, మీకు బాధ కూడా అంత తీవ్రంగా ఉంటుంది. ఎందుకంటే మీరు చాలా నిర్ణయాలు తెలిసి తెలియక తీసుకుంటూ ఉంటారు. "వాడు ఇలా అన్నాడు... వీడు అలా అన్నాడు" అని ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకుంటారు. దాని వల్ల కర్మ ఏర్పడుతుంది, ఆ కర్మ వల్ల మళ్లీ బాధలు వస్తాయి.

ఆత్మజ్ఞానం మీలో స్థిరపడాలంటే ప్రాపంచిక జీవితంలో కొన్ని విషయాలను తప్పనిసరిగా వదులుకోవాలి. ప్రక్కవాడు మీ మాట వినకపోయినా మీరే పదే పదే సలహాలు ఇస్తూ, వారు మనవాడే అన్నట్టు ప్రవర్తిస్తూ, వారి కోసం ఆలోచిస్తూ ఉంటారు. అది పిల్లలు, బంధువులు, చుట్టాలు ఎవరు అయినా కావచ్చు. మీకు ప్రాపంచిక విషయాల మీద ఎంత ఆసక్తి ఉంటుందో! అంతగా ఆధ్యాత్మికత తగ్గిపోతుంది.

ప్రాపంచికం పెరిగితే ఆధ్యాత్మికం తగ్గిపోతుంది. ఆధ్యాత్మికం పెరిగితే

ప్రాపంచికం తగ్గిపోతుంది. మీ కోరికలన్నీ గమనిస్తే అవన్నీ దేహానికి సంబంధించినవే ఉంటాయి, మంచి కారు కావాలి, సౌకర్యంగా జీవించాలి, పేరు, గౌరవం రావాలి, ఇవి అన్నీ దేహసంబంధ కోరికలే. అందుకే దేహవాంఛలు పెరిగితే, ఆత్మపై ఆసక్తి తగ్గిపోతుంది. దేహ వాంఛలు కోరికలకు అసలుమూలం.

ఆత్మజ్ఞానం పొందాలంటే దేహ వాంఛలు తగ్గించుకోవాలి ఇది మీరు ఎన్నోసార్లు విన్నారు, నేర్చుకున్నారు, కానీ ఆచరణలో పెట్టలేకపోతున్నారు. దానికి కారణం మీ సంస్కారాలు, వాసనలు. చిన్నప్పటి నుంచి వచ్చిన అలవాట్లు, పెరిగిన వాతావరణం, గత జన్మ ప్రభావాలు ఇవన్నీ మీలో బలంగా ఉండడం వల్ల.

ఒక కొబ్బరికాయను తీసుకోండి, పచ్చిగా ఉన్నప్పుడు లోపల కొబ్బరి చిప్పకు అంటుకుని ఉంటుంది. ఎండిపోయినప్పుడు కొబ్బరి చిప్ప నుండి వేరైపోతుంది. అలాగే మీలో దేహవాసనలు ఉన్నంత వరకు ఆత్మ–దేహ భేదం అనుభవం రాదు. దేహమే ప్రధానంగా ఉంటుంది. ఎప్పుడైతే దేహవాసనలు తగ్గుతాయో అప్పుడే ఆత్మ దర్శనం సాధ్యమవుతుంది.

తగ్గించుకోవడం అంటే తినకపోవడం కాదు, బట్టలు ధరించక పోవడం కాదు, జీవితం వదిలేయడం కాదు, ఉన్నదాన్ని అనుభవిస్తూ, లేనిదాని కోసం తపించకపోవడం. ఇదే నిజమైన నియంత్రణ. ఎప్పుడైతే మీరు "ఇది కావాలి" అని అనుకుంటారో అక్కడే కోరిక మొదలవుతుంది. కానీ ఉన్నదానితో తృప్తిగా ఉంటే విశ్వం ఎప్పుడు ఇస్తూనే ఉంటుంది. మీరు అవసరాలకు పరిమితమైతే జీవితంలో నిజమైన ఆనందం వస్తుంది. ఎప్పుడైతే మీరు "ఇంకా కావాలి" అని కోరుకోరో, ఉన్నదానితో సంతోషంగా ఉంటారో అప్పుడే ఆత్మదర్శనం పొందే అర్హత వస్తుంది.

"వాసనలు ఉన్నంతవరకు, వాసుదేవుడు తెలియడు". అంటే మీలో కోరికలు, ఆశలు ఉన్నంత వరకు పూర్తి ఆత్మజ్ఞానం సాధ్యం కాదు. బంధం

ఆత్మజ్ఞానం కలగడానికి అర్హతను తగ్గిస్తుంది. అరిషడ్ వర్గాలు ఆత్మజ్ఞానం తెలుసుకున్నా, ఆ జ్ఞానాన్ని మర్చిపోవడానికి కారణం అవుతుంది. ఇక కోరికలు ఉంటే ఆత్మ దర్శనం చేసుకోవడానికి, పొందడానికి అర్హతని కోల్పోతారు.

అందుకే ప్రతివారు తప్పనిసరిగా ఈ మూడు విషయాలు తెలుసు కోవాలి. మొదటిది బంధం: బంధాల వల్లే దుఃఖం వస్తుంది అని మీకు అర్థమైతే, ఆ దుఃఖాన్ని మళ్ళీ మళ్ళీ తలుచుకుంటూ ఉండకుండా జాగ్రత్తపడాలి. ఎందుకంటే, మీరు సాధన చేస్తున్నా, జ్ఞానం వింటున్నా, ఆ దుఃఖాన్ని పట్టుకుని ఉంటే, విన్న జ్ఞానం మీకు ఉపయోగపడకుండా ప్రక్కకు వెళ్లిపోతుంది.

మీకు ఎన్ని రకాల బంధాలు ఉన్నాయో మీరే విచారణ చేసుకోవాలి. తెల్లవారినప్పటి నుంచి గమనిస్తే మీకు ఏ ఏ విషయాల మీద బంధం ఉందో స్పష్టంగా తెలుస్తుంది. ఆ బంధాలన్నీ చివరికి బాధలకే కారణమవుతాయి. మీరు ఉదయం లేచి ధ్యానం చేస్తూ, జ్ఞానం పెంచుకోవడానికి ఎంతో సమయం కేటాయిస్తున్నారు. కానీ మీరు ఆశించిన ఫలితం రాకపోతే "ఇంత చేసినా నేను ఏం సాధించలేదు" అనే భావం వస్తుంది. అదే మీకు బాధగా మారుతుంది.

అందుకే మీకు ఎక్కడ బంధం ఉందో గుర్తించి, దాన్ని వదిలేయడానికి ప్రయత్నిస్తేనే సాధనలో పురోగతి వస్తుంది. మీరు జ్ఞానం పొందాలని అనుకుంటారు. కానీ అదే సమయంలో ప్రాపంచిక విషయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే మీరు చదివినది, విన్నది కూడా మర్చిపోతారు.

అరిషడ్వర్గాలు అంటే కామం, క్రోధం, మోహం ఇవి ఎందుకు ఎక్కువగా ఉంటాయంటే "కావాలి" అనే భావం మనిషికి పుట్టుకతోనే అలవాటై పోయింది. కారణం నాది అనుకున్న వాటిపై అంటే పిల్లల మీద, ఆస్తుల మీద, భార్య , భర్త మీద మోహం పెరగడం వల్ల.

ఆది శంకరాచార్యులు ఒక గొప్ప సూత్రం చెప్పారు **"బంగారం, మట్టి రెండూ ఒకటిగా కనిపించినప్పుడు నీకు మోహం లేనట్టే"** అంటే రెండూ

భగవంతుని సృష్టే అని భావించినప్పుడు, ఒకదానికి ఎక్కువ విలువ, మరొక దానికి తక్కువ విలువ ఇవ్వకపోతే, మీలో సమదృష్టి వస్తుంది, అప్పుడే మోహం తగ్గుతుంది.

కొంత మందికి చిన్న విషయానికే కోపం వస్తుంది. ఆ క్రోధం పెరుగుతుంటే కొన్నాళ్లకు మనిషి వివేకం కోల్పోయి మూర్ఖుడిగా మారిపోతాడు. మీకు "నేనే ఈ దేహం" అనే భావన ఉన్నంత వరకు కోరికలు పెరుగుతాయి, కోరికల వల్ల దుఃఖం వస్తుంది.

చాలామంది అంటారు: "నేను ఆత్మజ్ఞానం వింటున్నాను, కానీ అనుభూతి రావడం లేదు." దానికి కారణం బంధాలు, అరిషడ్వర్గాలు, దేహాత్మబుద్ధి, దేహపరమైన కోరికలు.ఇవి అన్నీ కలిసి మీ సాధనను అడ్డుకుంటాయి.

మీలో ఎన్ని లోపాలు ఉన్నాయో గుర్తించాలి. ఒక్కొక్కటిగా వాటిని సరిచేసుకోవాలి. "సరిచేసుకోవడం" అంటే విచారణ ద్వారా తెలుసుకుని, దానిని సరిదిద్దుకోవడం. ఎన్నో సార్లు చెప్పుకున్నాం, "తృప్తికి మించిన జీవితం లేదు," "ఆశకు మించిన దుఃఖం లేదు" అని. తృప్తిగా ఉన్నవాడి జీవితం ఎప్పుడూ ఆనందంగా ఉంటుంది. ఆశపడ్డవాడికి ఎప్పుడూ అసంతృప్తి, దుఃఖం వెంటపడుతూనే ఉంటాయి.

వీటిని తగ్గిస్తూ, తృప్తిగా జీవించడం నేర్చుకున్నవాడే నిజమైన ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్తాడు. ఆశపడే వాడికి ఎప్పుడూ అవరోధాలే ఎక్కువ, దుఃఖాలే ఎక్కువ. కానీ ఆధ్యాత్మిక జీవితం అంటే తృప్తితో జీవించగలిగే జీవితం. సాధారణంగా ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఎదిగినవారు చిన్నప్పటి నుంచే అలాంటి భావాలతో పెరుగుతారు. ఉదాహరణకు ఆది శంకరాచార్యుడు, ప్రహ్లాదుడు వీరు చిన్నతనం నుంచే భగవంతుడి మీద దృష్టి పెట్టారు, అది వారి గత జన్మ సంస్కారం.

మీ విషయానికి వస్తే మీకు భగవంతుడు ఉన్నాడు అని తెలుసు, కానీ ధ్యాన మార్గంలోకి వచ్చిన తర్వాతే ఆయన గొప్పతనం, మీ లక్ష్యం ఏమిటో స్పష్టంగా అర్థమవుతుంది. లేకపోతే ఈ విషయాలు మీకు తెలియవు.

ప్రాపంచిక జీవితంలో ఉన్నప్పుడు ఎవరైనా కోపంగా ఉంటే "అతను అలాంటివాడు" అని వదిలేస్తారు. కానీ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత "ఈ కోపం మీలో ఉండకూడదు" అని తెలుసుకుంటారు. ఎందుకంటే క్రోధం పెంచుకుంటే మనిషి మూర్ఖుడిగా మారతాడు, కోరికలు పెంచుకుంటే ఎప్పుడూ దుఃఖమే. ఉన్నదానితో తృప్తిగా ఉండేవాడు మాత్రమే నిజంగా ఆనందంగా జీవిస్తాడు.

భగవంతుడు కావాలంటే, ఆత్మదర్శనం పొందాలంటే దేహపరమైన కోరికలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకూడదు. దేహపరమైన కోరికలు పెరిగితే ఆత్మపరమైన ఎదుగుదల తగ్గిపోతుంది, బంధాలను తగ్గిస్తే భగవంతుడికి దగ్గరవుతాం.

మీ జీవితంలో పెద్ద బంధం పిల్లల మీదే ఉంటుంది. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు చూసుకోవాలి. కానీ వారు ఎదిగిన తర్వాత ఆ బంధాన్ని విడిచిపెట్టడం నేర్చుకోవాలి. పక్షులను గమనిస్తే తెలుస్తుంది, పిల్లలు పెద్దవాళ్లు అయిన తర్వాత అవి వాటిని వదిలేస్తాయి, అలాగే మీరు కూడా ఉండాలి.

ప్రతి ఒక్కరూ తమలో ప్రశ్నించుకోవాలి, నేను బంధంలో ఎక్కడ ఉన్నాను? నా ఆసక్తి ఎక్కడ ఎక్కువగా ఉంది? అరిషడ్వర్గాలు నాలో ఎలా ఉన్నాయి? ఇవి ఎప్పటికప్పుడు విచారణ చేసుకుంటూ ఉండాలి. కొంతమంది అంటారు, "నాకు ఆసక్తి లేదు" అని. కానీ గమనిస్తే ప్రక్క వాళ్ళ గురించి మాట్లాడటం, గాసిప్ చేయడం లాంటివి వుంటాయి, ఇదే విషయాసక్తి. మీరు గొప్పవాళ్ళమన్న భావంతో ఇతరుల గురించి మాట్లాడటం కూడా ఒక లోపమే.

చాలామంది అనుకుంటారు విమర్శ అంటే ప్రక్కవారిని తప్పుపట్టడం

అని. కానీ  విమర్శ అంటే మీ లోపాలను  గుర్తించి సరిచేసుకోవడం. **"ప్రక్కవాడిని విమర్శిస్తే  కర్మ వస్తుంది, మిమ్మల్ని మీరు  విమర్శించుకుంటే అభివృద్ధి వస్తుంది".** ఒక నిజమైన ఆత్మజ్ఞాని  ప్రక్కవారి లోపాలను చూడదు, తన లోపాలను మాత్రమే సరిచేసుకుంటాడు.

మొదట బంధాలు, బంధాల వల్ల అరిషడ్వర్గాలు, అరిషడ్వర్గాల వల్ల దేహపరమైన కోరికలు  ఇవన్నీ కలిసి మీ జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తాయి. ఎంత ప్రయత్నించినా ఆత్మదర్శనం కలగకపోవడానికి, అనుభూతి రాకపోవడానికి ఇవే కారణాలు.

అందుకే మీరు ఎప్పటికప్పుడు  పరిశీలించుకోవాలి "నాకు అనుభూతి ఎందుకు కలగట్లేదు?" "ఇందుకు కారణం ఏమిటి?" ఇది నిజాయితీగా తెలుసుకోవాలి. మీ తప్పు మీరు గుర్తించకపోతే మీలో ఎప్పటికీ మార్పు రాదు.

ఒక విజ్ఞాని ఎలా ఉండాలంటే తన తప్పులు సరిదిద్దుకుంటూ గురువు చెప్పిన విషయాలని ఆచరణలో పెట్టుకున్నవాడే విజ్ఞాని అవుతాడు, జ్ఞానిగా ఉన్నప్పుడు వింటాడు, విజ్ఞానిగా ఉన్నప్పుడు ఆచరణలో పెట్టుకుంటాడు విజ్ఞానే ప్రజ్ఞానిగా ఎదగాలి, ప్రజ్ఞాని బ్రహ్మ జ్ఞానిగా ఎదుగుతాడు.

ఒక నిజమైన విజ్ఞాని తన తప్పులను గుర్తిస్తాడు  వాటిని సరిదిద్దుకుంటాడు గురువు చెప్పిన విషయాలను ఆచరణలో పెడతాడు, ఇలానే ఎదుగుతాడు. గురువు చెప్పడం మాత్రమే చేస్తాడు.  మార్చుకోవాల్సింది శిష్యుడే. ఇది ఒక రోజులో జరిగేది కాదు. ఇది ఎప్పటికీ కొనసాగుతూ ఉండే ప్రక్రియ. వినడం ఆలోచించడం, ఆచరించడం, సరిదిద్దుకోవడం.

ఆత్మానుభూతి పొందాలంటే  బంధాలను తగ్గించాలి, అరిషడ్ వర్గాలను నియంత్రించాలి, కోరికలను తగ్గించాలి, మీలోని లోపాలను గుర్తించి సరిచేయాలి. ఈ జాగ్రత్తలు తీసుకున్నప్పుడే మీకు ఆత్మానుభూతి కలుగుతుంది. ఇదే ఆధ్యాత్మిక జీవితం తెలుసుకోవడం, ఆచరించడం, మారడం.

# ఆత్మ విద్య తెలుసుకోవాలంటే?

ఆత్మవిద్య తెలుసుకోవాలి అనే కోరిక ప్రతి ఒక్కరిలో ఉంటుంది. కానీ ప్రతి ఒక్కరూ కూడా దాని మీద తీవ్రాతి తీవ్రమైన తపన పెంచుకోవాలి. ప్రాపంచిక చదువులు వేరు, ఆధ్యాత్మిక చదువులు వేరు, ఇప్పుడు మీరు అందరూ కూడా ఆధ్యాత్మిక చదువులో ఉన్నారు. ఇది ఆషామాషీ కాదు.

ధ్యానం అనేది రోగాలు తగ్గడానికి, సంకల్పాలు నెరవేరడానికి అనుకుంటే, ఆత్మను మీరు తెలుసుకోలేరు. మీరు మానవ జన్మ ఉద్దేశ్యం తెలుసుకున్నారు, మానవ జన్మకున్న అర్హత తెలుసుకున్నారు. ఈ ఆత్మవిద్య పొందేది ఒక్క మానవ జన్మ లోనే సాధ్యం అని తెలుసుకున్నారు. అది పొందిన వారి జీవితం సార్థకం అవుతుంది అని తెలుసుకున్నారు.

మరి ఇన్ని తెలుసుకున్న మీరు, మరి ఆత్మ విద్య, ఎలా పొందాలి? ఎందుకు వెనక పడుతున్నారు? ఇది పొందడానికి కావలసిన మార్గం ఏంటి? ఇవన్నీ తెలుసుకుంటేనే ముందుకు వెళ్ళగలరు, లేకపోతే ముందుకు వెళ్ళలేరు.

మరి ఎన్ని తెలుసుకున్నా మీరు ముందుకు వెళ్ళలేకపోతున్నారు అంటే, మీలో ఉన్న అశ్రద్ధ, బద్ధకం. ఇవన్నీ మీకు తెలుస్తున్నట్టే అనిపిస్తాయి కానీ, నిజంగా ఏమి తెలియదు. మరి ఇవి ఎలా తెలుసుకోవాలో ఒక్కొక్క విషయం తెలుసుకుందాం.

ఏమిటంటే చాలా సార్లు చెప్పుకున్నాం పరమాత్మ కృప వల్ల గురువు వస్తాడు అని. గురువు వచ్చినా, ఆ గురువు సద్గురువా? కాదా? అని తెలుసుకోవడానికి ఒకటే గుర్తు. ఎప్పుడైతే గురువు “నువ్వు శరీరం కాదు, ఆత్మవి” అని చెప్పాడో, వారు కచ్చితంగా సద్గురువులే అవుతారు.

సద్గురువులు కాకపోతే శరీరం భోగాల్లో ఉంచడానికి కావలసినవి చెప్తారే తప్పించి, మోక్షం పొందడానికి ఏ విధంగా ప్రయత్నించాలో చెప్పలేరు. ఎందుకంటే ఒక సద్గురు మాత్రమే ఈ సృష్టి రహస్యాలను తెలుసుకోగలరు.

కానీ బాధ గురువులు అవి తెలుసుకోలేరు. శిష్యులకు కూడా ఈ జన్మను ఎలా భోగంలో ఉంచుకోవాలో చెప్తారు కానీ యోగంలో ఉంచుకునే మాటలు చెప్పరు.

మరి సద్గురు అనడానికి గుర్తు ఏమిటంటే "నువ్వు శరీరం కాదు నువ్వు ఆత్మవి, మానవ జన్మ ఉద్దేశ్యం దైవాన్ని తెలుసుకోవడానికి అర్హత ఉన్న జన్మ" అని గురువు బోధించాడు అంటే, ఆ గురువు సద్గురువు అయ్యే ఉంటారు.

ఆ సద్గురువులు ఎప్పుడైతే మీకు అలా బోధిస్తారో, అప్పుడు మీరు గురువుపై విశ్వాసం ఉంచాలి, గురువు మాట మీద నమ్మకం ఉంచాలి. ఈ రెండు చాలా ఎక్కువగా ఉండాలి. అందుకే ఆ గురువును నమ్మినవాడు ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థాయికి ఎదుగుతాడు.

ఇప్పుడు రాఘవరావు గారిని తీసుకుంటే, "ఆత్మ" అనే పదం వినక ముందు ఆయన ఎప్పుడూ ఏ స్వామీజీల దగ్గరకి, ఏ గురువుల దగ్గరకి వెళ్ళలేదు. కానీ ఎప్పుడైతే పత్రి గారు "నువ్వు ఆత్మవే కానీ శరీరం కాదు అని చెప్పారో! శరీరానికి చేసే పుణ్య కర్మలన్నీ జన్మకి కారణం అవుతాయి, ఆత్మకి చేసే పుణ్య కర్మలన్నీ మోక్షానికి తీసుకువెళ్తాయి" అని తెలిసింది. అప్పుడు ఆయన "ఈయనే నా జీవితానికి గురువు" అని నమ్మారు. ఆయన మాట మీద విశ్వాసం ఉంచారు.

మీరు గురువును నమ్మాలి, ఆ తర్వాత విశ్వాసం ఉంచాలి. అసలు గురువునే సెలెక్ట్ చేసుకోవడం రాకపోతే, మరి ఆత్మవిద్య మీరు ఎలా నేర్చుకోగలరు? అందుకే గురువు మీద నమ్మకం, ఆయన మాట మీద విశ్వాసం ఉండాలి. విశ్వాసం ఉంచుకోవడం అంటే, ఆయన ప్రతి మాట సత్యమని తెలుసుకోవడం, ఆ మాటలు దైవానికి దగ్గర చేస్తాయి, మోక్షం పొందే అర్హతను కలిగిస్తాయి. అలా మీరు అర్థం చేసుకున్నప్పుడు, ఆయన ప్రతి మాట మీకు రాచబాటలా మారుతుంది.

ఇప్పుడు చూడండి, రహదారి బాగా ఉంటే కారు స్పీడ్‌గా వెళ్తుంది.

అలాగే గురువు మీకు సత్యాన్ని చెప్పినప్పుడు, ఆ మాట మీద మీకు నమ్మకం ఉన్నప్పుడు, దాన్ని మీరు ముందుకు వెళ్ళడానికి, అంటే జీవితంలో ఎదగడానికి అవకాశం అవుతుంది. మరి అది చెప్పి గురువు వదిలేయడు, తర్వాత మీకు రెండు విషయాలు సాధన, స్వాధ్యాయం చెప్తారు.

సాధన దేనికంటే, భగవంతుని తెలుసుకోవడానికి, చేరుకోవడానికి. ఆ తరువాత స్వాధ్యాయం ఎందుకు చేయిస్తారు అంటే ఎన్నో శాస్త్రాల ద్వారా, వాళ్ళ వాళ్ళ అనుభవం ద్వారా పొందిన జ్ఞానాన్ని సద్గురువులు, సత్పురుషులు, జగద్గురువులు పుస్తకాల ద్వారా వ్రాసి వున్నారు.

ఇప్పుడు ఒక భగవద్గీత తీసుకోండి, వశిష్ఠ గీత తీసుకోండి, అష్టావక్ర గీత తీసుకోండి, శంకరాచార్యులు వ్రాసిన ఆత్మబోధ తీసుకోండి ఇలా ఎన్నో పుస్తకాల స్వాధ్యాయం ద్వారా జ్ఞానాన్ని ఎలా పెంచుకోవచ్చో వారు చూపించారు.

వారు ధ్యానంలో పొందిన అనుభూతులను మనకు శాస్త్రాల ద్వారా తెలియజేశారు. అందుకే గురువు "నేను చెప్పానని నమ్మకండి. శాస్త్రాల ద్వారా మీరు తెలుసుకోండి, తెలుసుకున్న జ్ఞానాన్ని మీ సాధన ద్వారా అనుభూతి పొందండి" అని చెపుతారు.

మరి రోజు సత్ గ్రంథ పఠనం, సాధన ఈ రెండూ చేస్తే, మూడవది మీరు విచారణ చేసుకుంటారు. అందుకే బుద్ధుడు కూడా "నేను చెప్పానని నమ్మొద్దు, శాస్త్రం చెప్పిందని నమ్మొద్దు, మీ అనుభవంలోకి ఏది వస్తుందో అదే తీసుకో" అన్నారు. అందుకే పత్రి గారు కూడా "అనుభవమే జ్ఞానం" అన్నారు.

ఇప్పుడు "నువ్వు ఆత్మవు" అని గురువు వదిలేయలేదు, ఆత్మ అంటే భగవంతుడు అని కూడా చెప్పారు. గురువు ఇంకా భగవంతుడు అంటే శాశ్వతుడు, ఎప్పుడూ ఉండేవాడు, అదే సత్యం అని చెప్పడం జరిగింది.

మరి శరీరం ఎప్పుడూ ఉంటుందా? అంటే ఉండదు. అందుకని శరీరం, మనసు, బుద్ధి ఇలా ఏదీ నేను కాదు అని విచారణ చేసుకుంటే

తెలుస్తుంది. మీరు శాశ్వతమైన ఆత్మ అని.

అందుకే సామాన్య గురువులు ఈ మూడింటి వరకే చెప్పగలరు. కాని సద్గురువు ఆత్మ అన్ని స్థితులను అంటే బాల్యం, యవ్వనం, కౌమారం, వార్థక్యం చివరికి శరీరాన్నికూడా విడిచిపెట్టి వెళ్తుంది అని చెప్తారు. గురువు ఇంకా మరణానంతరం ఆత్మ కొత్త శరీరాన్ని తీసుకుంటుంది. అలా ఆత్మ పూర్ణ జ్ఞానం పొందే వరకు కొత్త శరీరాలు తీసుకుంటుంది అని చెప్తారు. ఇంకా మీరు ఇంకో శరీరం ధరించబోతున్నారు కాబట్టి మీకు మరణం లేదు, అందుచేత మీరు మరణానికి భయపడక్కర్లేదు, చింతించక్కర్లేదు అని చెప్తారు. అవే శాస్త్రాలు, భగవద్గీత కూడా చెబుతాయి.

మరి మరణానంతర జీవితం గురించి శిష్యులకు బోధించకపోతే, వారికి మరణ భయం పోదు. అందుకే సద్గురువు ఎప్పుడూ సత్యమైన ఆత్మ యొక్క స్వరూపాన్ని, దాని ప్రయాణాన్ని చెప్తారు, మరణానికి భయపడాల్సిన అవసరం లేదు అని ధైర్యం చెప్తారు.

ఈ శరీరాన్ని మీరు అనుభవం కోసం ధరించారు. ఆ అనుభవం పూర్తయిన తర్వాత, ఈ శరీరాన్ని విడిచిపెట్టి, ఆత్మ కొత్త శరీరాన్ని తీసుకుంటుంది అని చెప్పి, శిష్యులలోని మరణ భయాన్ని తొలగిస్తారు. కానీ సద్గురువు దగ్గర నుంచి ఎన్ని విషయాలు తెలుసుకున్నా, అది అనుభవంలో పెట్టుకోవాల్సింది శిష్యుడే.

మీరు అందరూ చనిపోయే వారిని చూస్తున్నారు, పుట్టేవారిని చూస్తున్నారు. ఇవన్నీ చూస్తున్నప్పుడు మీకు అనుభవం వస్తుంది శరీరానికి మరణం ఉంది, కానీ నాకు మరణం లేదు. ఆత్మ పుట్టదు, చావదు అన్న పరమ సత్యాన్ని మీరు తెలుసుకోవాలి.

ఆత్మ శరీరాలను మాత్రమే మార్చుకుంటూ ఉంటుంది. మరి "నేను ఆత్మనే కానీ శరీరం కాదు" అని తెలుసుకున్నాక, మీరు ఆత్మలా ప్రవర్తించడం ప్రారంభించాలి.

ఆత్మ అంటే భగవంతుడు. భగవంతుడు ఎంత స్వచ్ఛంగా ఉంటాడో, మీరు కూడా అంత స్వచ్ఛంగా ఉండాలి. అలా జీవించినప్పుడే మీకు తృప్తికరమైన జీవితం ఉంటుంది.

మీరు తాత్కాలిక సుఖం కోసం, తాత్కాలిక ఆనందం కోసం అబద్ధం చెప్పొచ్చుఅనుకుంటారు, ఎదుటివాడిని మోసం చేయొచ్చు. "నాది" అనే భావంతో ఈర్ష, ద్వేషాలు ఉండచ్చు అనుకుంటారు.

కానీ ఇవన్నీ చేస్తూ ఉంటే, ఎప్పుడూ తృప్తికరమైన జీవితం మీకు ఉండదు. ఒకసారి అబద్ధం చెప్పితే, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి మరొకటి చెప్పాలి. అది చివరి వరకు మనసును వేధిస్తూనే ఉంటుంది. మీరు ఆత్మజ్ఞానం పొందడానికి లేదా పొందలేకపోవడానికి కారణం "నేను ఆత్మను" అని తెలుసుకున్నాక. కాని చిన్న చిన్న పొరపాట్లు మీలో నుంచి వస్తుంటాయి. అది మీ మనసులో ఉన్న దౌర్బల్యం వల్ల, ప్రాపంచిక జీవితంలో గొప్పగా కనిపించాలి అనే దౌర్భాగ్యం వల్ల, మనసులోని లోపాల వల్ల చిన్న చిన్న అబద్ధాలు చెప్తూ ఉంటారు. అవి కూడా మీకు జ్ఞానం పొందడానికి, ఆత్మని తెలుసుకోవడానికి అడ్డంగా మారుతాయి.

కొంతమంది అంటారు ఎన్ని రోజులు అయినా నాకు ఫలితం కనిపించట్లేదు అని. అప్పుడు మీరు ఒకసారి విచారణ చేయాలి ప్రాపంచిక జీవితంలో నేను ఎలా జీవిస్తున్నాను? ఎంత నిజాయితీగా జీవిస్తున్నాను? అని. అందుకే ముందే చెప్పినట్టు ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నత స్థితి పొందాలంటే, ప్రాపంచిక జీవితం పునాది లాంటిది అని తెలుసుకోవాలి.

అందుకే గురువులు ఇంద్రియనిగ్రహం గురించి చెప్పారు. మనసు చంచల స్థితి నుంచి నిశ్చల స్థితికి, నిర్మల స్థితికి రావాలి అని చెప్పారు. ఇవి అన్నీ ఎందుకు చెప్పారు అంటే మీ ఆధ్యాత్మిక జీవితం ఉన్నత స్థితికి వెళ్లాలి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి. ఉన్నత స్థితి అంటే "నేను ఆత్మని" అన్నట్టుగా

జీవించడం. ఉన్నత శిఖరం అంటే బ్రహ్మ జ్ఞానం పొంది, సృష్టి సత్యాన్ని పూర్తిగా తెలుసుకోవడం.

దానికోసమే మీరు మానవ జన్మ పొందారు అని గురువు ద్వారా తెలుసుకుంటారు. గురువు వచ్చే వరకు మీకు సత్యం తెలియదు. అప్పటివరకు మీరు "నేను శరీరం" అనే భావంతో జీవించారు. సుఖాలు, దుఃఖాలు, శోకం, మోహం, అరిషడ్వర్గాలు, అహంకారం, మమకారం ఇవన్నీ మీలో ఉన్నాయి. అందుకే శాంతి తక్కువ, అశాంతి ఎక్కువగా వుంటుంది. కానీ సద్గురువు వచ్చి సత్యం చెప్పిన తర్వాత, మీలో శాంతి ప్రారంభమవుతుంది. "నేను దేహం కాదు, నేను ఆత్మని" అని అనుకున్నప్పుడు తృప్తి కలుగుతుంది.

ఆ తృప్తి కూడా ఆత్మజ్ఞానం పొందే అర్హత ఉన్నవారికే కలుగుతుంది. అర్హత లేకపోతే "ఏదో చెప్తున్నాడు", "ఏవేవో లోకాల గురించి చెప్తున్నాడు", "కనిపించని ఆత్మ గురించి చెప్తున్నాడు" అని అనుకుని, అర్థం చేసుకోకుండా తిరస్కరించే అజ్ఞానులు కూడా ఉంటారు. అంటే దైవం గురించి సరైన అవగాహన లేని వాళ్లకు, సద్గురువు ఏం చెప్పినా నచ్చదు. దైవం మీద సరైన అవగాహన ఉన్నవారికి, శాస్త్రాల మీద పట్టు ఉన్నవారికి, శాస్త్రం కరెక్ట్ అని నమ్మినవారికి దైవం మీద ఇష్టం పెరుగుతుంది. గురువు మీద నమ్మకం, విశ్వాసం రెండూ పెరుగుతాయి.

అందుకే గురువు చెప్పిన ప్రతి మాటను మీరు ఆచరణలో పెట్టుకోవాలి. మొదట ఇంద్రియ నిగ్రహం చెప్తారు, తర్వాత సత్ప్రవర్తన చెప్తారు. ముందు ఇంద్రియాలను అదుపులో పెట్టుకోండి, ఆహార నియమాలు పాటించండి అని చెప్తారు. ఎందుకంటే ఆహారం వల్లే మనసు ప్రవర్తన వుంటుంది. మనసు వల్లే ఇంద్రియాలు మంచిగా ఉండాలా? చెడ్డగా ఉండాలా? అనేది నిర్ణయమవుతుంది.

మనసు తమోగుణం, రజోగుణంలో ఉంటే ఇంద్రియనిగ్రహం రాదు.

అందుకే సాత్విక గుణంలో మనసును ఉంచడానికి ఎలాంటి ఆహారం తినాలో కూడా మీరు ఆచరణలో పెట్టుకోవాలి. పత్రి సార్ ఒక సందర్భంలో చెప్పారు "సరైన ఆహారం లేకపోతే నేను పస్తు అయినా ఉంటాను, కానీ ఎలాంటి ఆహారం పడితే అలాంటి ఆహారం తినను, నా ఎనర్జీ కోల్పోను అంటారు. ఎనర్జీ పోతే  సాధారణ మానవులం అయిపోతారు.

అందుకే అత్యున్నత స్థాయికి ఎదగాల్సిన మీరు, ఆహార ప్రలోభానికి లొంగిపోతే క్రిందకి పడిపోతారు.  ముఖ్యంగా యోగులు ఎక్కడ పడితే అక్కడ తినరు.

కాని తమోగుణం, రజోగుణానికి సంబంధించిన ఆహారం తింటే వారి మనసు కలుషితమవుతుంది. అందుకే పత్రిగారు సాత్విక గుణంలో ఉన్నవారే వండాలి అని కూడా చెప్పారు, అందరూ ఆత్మ స్వరూపులే కానీ ప్రవర్తన వేరు. సింహం కూడా ఆత్మే, కానీ మీరు దాన్ని ఇంట్లో పెంచుతారా? అంటే పెంచరు.

అందుకే అందరూ ఆత్మ స్వరూపులే అని తెలుసుకున్నా, వారి గుణాలను బట్టి మీరు ప్రవర్తించాలి. ఎక్కడ ఆహారం తీసుకోవాలో జాగ్రత్తగా నిర్ణయించుకోవాలి. మీ మనసు ఎప్పుడూ సాత్విక గుణంలో ఉండాలంటే, ఎలాంటి ఆహారం తినాలో గురువు చెప్పిన విధంగా మీరు పాటించాలి. ఒక్క రోజైనా మీరు అలసత్వంతో ఏదైనా తింటే, మళ్ళీ క్రిందకి దిగిపోతారు అన్నది గమనించుకోవాలి.

ప్రాపంచిక విషయాల్లో ఎక్కువ ఆసక్తి ఉంటే, మీలో రజోగుణం ఉన్నట్టు. ధ్యానంలోకి వచ్చి కూడా శరీరం, మనసు కోసమే శక్తిని ఉపయోగిస్తే, తమోగుణం, రజోగుణంలోనే ఉన్నట్టు. కానీ గురువు "నువ్వు ఆత్మవి" అని చెప్పినప్పుడు, ఆ మాటను శాస్త్రాల ద్వారా మననం చేసి, సాధన ద్వారా అనుభవంలో పెట్టాలి. మీరు ఆత్మలా ప్రవర్తించడం ప్రారంభించాలి, అక్కడి

నుంచి దైవగుణాలు రావాలి. దైవ గుణం అంటే ఇవ్వడం, త్యాగం, మానవ గుణం అంటే తీసుకోవడం. “ఎదుటివాడి దగ్గర నుంచి నాకు ఏమి వస్తుంది?” అని ఆలోచించడం. రాక్షస గుణం అంటే “నేనే గొప్పవాడిని కావాలి” అని కోరుకోవడం. కానీ దైవ గుణం అంటే ఇవ్వడం, త్యాగం, సేవ. ఈ లక్షణాలు మీలో ఉన్నాయా? లేదా? అన్నది మీరు ఎప్పుడూ విచారణ చేసుకోవాలి. మీరు ఎలా ప్రవర్తిస్తున్నారు? అనేది మీరు మీలోనే పరిశీలించుకోవాలి.

ఇచ్చే గుణం చాలా ముఖ్యం. చాలామంది నేను క్లాసులకు వెళ్ళినప్పుడు చెప్తారు “మేడం, ఈ వయసులో కూడా తిరుగుతున్నారు” అని. వారు అలా చెప్పినప్పుడు నాకు గుర్తొస్తుంది నాకు 74 ఏళ్ళు అని. అప్పుడు నేను ఆలోచించేది ఏంటి అంటే 50 ఏళ్ళు వచ్చిన తర్వాత జ్ఞానం తెలుసుకున్నాను. 55 ఏళ్ళు వచ్చిన తర్వాత ప్రచారం మొదలు పెట్టాను. మరి నేను భూమిమీద ఎన్ని రోజులు ఉంటానో తెలియదు. కాబట్టి తెలుసుకున్న సత్యం, తెలుసుకున్న జ్ఞానం అందరికీ పంచాలి.

చాలామంది అనుకుంటారు డబ్బు కూడబెట్టాలి, సంపద పెంచుకోవాలి, ఏడు తరాలు తినాలి అని, కానీ అది కాదు. జ్ఞానంలోకి వచ్చిన తర్వాత, మీరు చనిపోయినా, ఏడు తరాలు మీ గురించి గొప్పగా చెప్పుకునేలా జీవించాలి. “మా ఇంట్లో మా అమ్మమ్మ, మా బామ్మ ఇలా జ్ఞానం నేర్పేవారు” అని ఏడు తరాలు చెప్పుకునేటట్టు మీరు జీవించాలి. ఏడు తరాలు సుఖంగా ఉండాలని సంపదలు కూడబెట్టడం కాదు జ్ఞానం అనే సంపద ఇవ్వాలి. జ్ఞానం సంపాదించాలంటే, ప్రాపంచిక సంపద మీద ఆసక్తి తగ్గించుకోవాలి. పూర్తిగా వదిలేయడం కాదు, మీకు రావాల్సింది వస్తూనే ఉంటుంది, తినడానికి, ఉండడానికి లోటు ఉండదు.

మీరు ఎప్పుడైతే దానిపై తృప్తి పడతారో, ఆధ్యాత్మిక సంపదను అంతులేని విధంగా పొందగలరు. ఇది మేము మా జీవితాల్లో చూస్తున్నాం,

ఎంత వచ్చినా దానికే తృప్తి పడుతున్నాం. “ఇంకా ఇంకా కావాలి” అనే ఆశ లేదు, మా ఆశయం అంతా  జ్ఞానం పొందడం, జ్ఞానం పంచడం. దీనికి వయసు అడ్డంకి కాదు, మనసు అడ్డంకి కాదు. శరీరం అలసిపోవచ్చు ప్రాపంచిక సంపద కూడబెట్టేటప్పుడు, కానీ ఆధ్యాత్మిక సంపద కూడబెట్టేటప్పుడు అలసట ఉండదు, పంచేటప్పుడు కూడా అలసట ఉండదు.

ఎందుకంటే పరమాత్మ కృప మీ మీద ఉంటుంది, అది ప్రకృతి ద్వారా మీకు అందుతూనే ఉంటుంది. అందుకే మీరు ఆత్మవిద్య నేర్చుకోవాలి, అందులో ఎదగాలి అంటే ముందుగా సద్గురువులు ఉన్నారు అని నమ్మకం కలగాలి. తర్వాత ఆయన మీద, ఆయన మాట మీద నమ్మకం, విశ్వాసం ఉండాలి. ఆ తర్వాత గురువు చెప్పిన విధంగా మీరు నడుచుకోవాలి. ఆయన స్వాధ్యాయం చేయమన్నాడు కచ్చితంగా చేయాలి, సాధన చేయమన్నాడు కచ్చితంగా చేయాలి.

ఎందుకంటే ఒకసారి ఉన్న అభిప్రాయాన్ని మార్చుకునే స్థితి ఎవరికి వస్తుంది అంటే శక్తి లేని వారికి వస్తుంది. పత్రి గారు “నువ్వు ఆత్మవి” అని చెప్పారు. కానీ మీరు ఆత్మలా జీవించలేకపోతున్నారు అంటే, మీ శక్తి సరిపోవడం లేదు. ఆ శక్తి కోసమే మీరు నిరంతరం ధ్యానం చేయాలి. పాత వాసనలు, పాత భావాలు, పాత అలవాట్లు వీటిని మార్చడానికి శక్తి కావాలి. లేకపోతే అవే మిమ్మల్ని తిరిగి పాత దారిలోకి తీసుకెళ్తాయి.

చాలామంది  మాంసం మానేస్తున్నారు, వెల్లుల్లి మానేస్తున్నారు. కానీ మాట, చేత మారడం లేదు, ఈ రెండు మారాలి. అక్కర్లేని విషయాలు మీరు పోగు చేసుకుంటున్నారు, వీలైనంత వరకు వాటిని తగ్గించుకోవాలి. స్వాధ్యాయం కూడా నిరంతరం చేయాలి, మీలో నిరంతర తపన ఉండాలి. ఒక వస్తువు కొనాలనుకుని కొనలేకపోతే ఎంత బాధపడతారో చూడండి. ఒక చోటికి వెళ్లాలనుకుని వెళ్లలేకపోతే ఎంత బాధపడతారో చూడండి.

అంత బాధ మీకు ఆత్మ దర్శనం రాకపోతే వస్తుందా? "నాకు ఇంకా ఆత్మదర్శనం కావడం లేదు" అని మీరు ఏడుస్తున్నారా? లేదు అంటే ఆసక్తి తక్కువ, ఆ ఆసక్తిని మీరు పెంచుకోవాలి.

ఒకసారి వివేకానందుడు రామకృష్ణ పరమహంసను అడిగాడు "మీరు దైవాన్ని చూశారా?" అని. అప్పుడు ఆయన చెప్పారు "నిన్ను చూసినంత స్పష్టంగా చూశాను" అని. "నాకు కూడా చూపించరా?" అని అడిగితే, ఆయన గంగా నదికి తీసుకెళ్ళి నీటిలో ముంచారు. ఊపిరి ఆడక విలవిలలాడినప్పుడు బయటికి తీసి చెప్పారు "నీ ప్రాణం కోసం ఎంత తపించావో, అంత తపనతో దైవాన్ని కోరుకుంటే దర్శనం తప్పకుండా వస్తుంది" అని.

మరి మీకు అంత తపన ఉందా? ఉంటే, మీకు కూడా ఆత్మ దర్శనం కలుగుతుంది. "నాకు ఇంకా కలగట్లేదు" అని అనిపిస్తే మీరు ఎక్కడ తప్పుతున్నారు, ఎక్కడ అశ్రద్ధ ఉంది, ఎక్కడ బద్ధకం ఉంది అని విచారణ చేయాలి. మీ పట్టుదల పెంచుకోవాలి. ఆత్మ విషయాల్లో తీవ్రత ఉండాలి, ప్రయత్నించాలి, మళ్ళీ ప్రయత్నించాలి, సాధించే వరకు ప్రయత్నం ఆపకూడదు. మీరు ఒక కోర్సు చదవాలంటే రాత్రింబగళ్లు చదువుతారు. పిల్లల్ని కూడా అలాగే చదివిస్తారు. అలాగే మీరు ఆత్మజ్ఞానం కోసం కూడా అదే తీవ్రతతో ప్రయత్నించాలి.

మరి మీరు అనుకున్న గమ్యం చేరాలి అంటే ఎంత తపన ఉండాలి. మరి ఆత్మ విద్య తేలిగ్గా లభ్యమయ్యేది కాదు నిరంతర తపన, నిరంతర శ్రద్ధ, నిరంతర ప్రయత్నం ఇవన్నీ ఉన్నప్పుడే మీరు సాధించగలరు, లేకపోతే ఏది సాధించలేరు. ఆత్మ అన్నది తెలిసింది అనుకుంటున్నారు, కాని ఈ ఆత్మ గురించి చదివి ఆత్మ విద్య వచ్చేసింది అనుకుంటున్నారు, బ్రహ్మ విద్యలో ఉన్నాము అనుకుంటున్నారు కాని భ్రమలు మాత్రం వదలట్లేదు.

అందుచేత "నీ భ్రమ వదులితే బ్రహ్మమే అవుతావు". నేను శరీరం అనే భ్రమ వదులు, నేను ఆత్మని అనే బ్రహ్మము అవుతావు.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | |
|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/- | 43) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/- | 44) మోక్షం అంటే? - రూ.70/- |
| 3) జీవిత సత్యాలు - రూ.130/- | 45) కబీరు సందేశాలు-1 -రూ.70/- |
| 4) సత్యమార్గం - రూ.160/- | 46) మనసు-1 - రూ.70/- |
| 5) ధ్యాన శక్తి - రూ.130/- | 47) మనసు-2 - రూ.70/- |
| 6) ధ్యాన శాస్త్రం - రూ.130/- | 48) కబీరు సందేశాలు-2 -రూ.60/- |
| 7) ఆత్మ శాస్త్రం - రూ.120/- | 49) దుఃఖ నివారణామార్గం - రూ.60/- |
| 8) మరణించకముందే మరణించాలి - రూ.130/- | 50) బ్రహ్మజ్ఞానం - రూ.60/- |
| 9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/- | 51) ధ్యానం (పత్రీజీ) - రూ.60/- |
| 10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/- | 52) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/- |
| 11) గీతాసందేశం - రూ.120/- | 53) అతీంద్రియ శక్తులు - రూ.60/- |
| 12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/- | 54) ఆలోచించండి - రూ.60/- |
| 13) జీవిత సూక్ష్మాలు - రూ.100/- | 55) నిర్వాణ మార్గం - రూ.60/- |
| 14) భగవంతుడంటే - రూ.100/- | 56) ధ్యానులకు సూచనలు - రూ.60/- |
| 15) తెలుసుకోండి - రూ.100/- | 57) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/- |
| 16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/- | 58) మమకారం - రూ.60/- |
| 17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/- | 59) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/- |
| 18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం?- రూ.100/- | 60) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/- |
| | 61) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/- |
| 19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/- | 62) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/- |
| 20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100 | 63) సంకల్పమంటే? - రూ.50/- |
| 21) కఠోపనిషత్తు - రూ.90/- | 64) ఈ జీవితం ఎందుకు? - రూ.50/- |
| 22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/- | 65) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/- |
| 23) కర్మ సిద్ధాంతం - రూ.80/- | 66) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/- |
| 24) ధ్యానమంటే ? - రూ.80/- | 67) అరిహంత్ - రూ.50/- |
| 25) త్రివిధాలు - రూ.80/- | 68) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/- |
| 26) ఉత్తమ పురుషుడు - రూ.80/- | 69) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/- |
| 27) వశిష్ఠుల వారి సందేశాలు- రూ.70/- | 70) విదురుని సందేశాలు -రూ.40/- |
| 28) శాస్త్రాల అర్థం-అంతరార్థం - రూ.70/- | 71) మూడురకాల జీవితాలు -రూ.40/- |
| 29) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/- | 72) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/- |
| 30) జ్ఞాన జ్యోతి - రూ.70/- | 73) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/- |
| 31) జ్ఞాన కుసుమాలు - రూ.70/- | 74) బ్రహ్మం అంటే? -రూ.40/- |
| 32) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/- | 75) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/- |
| 33) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/- | 76) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/- |
| 34) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/- | 77) మహాత్ముల సందేశాలు - రూ.40/- |
| 35) బుద్ధుని సందేశాలు - రూ.70/- | 78) సత్యం - రూ.40/- |
| 36) భూతదయే దైవత్వం - రూ.70/- | 79) చక్రాలు - రూ.40/- |
| 37) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/- | 80) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/- |
| 38) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/- | 81) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/- |
| 39) ధర్మ సూక్ష్మాలు - రూ.70/- | 82) మౌన ధ్యానం - రూ.40/- |
| 40) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/- | 83) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/- |
| 41) మానవునిలోని చెడు -రూ.70/- | 84) శాకాహారమే మానవాహారం - రూ.15/- |
| 42) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/- | 85) అహింస మరియు శాఖాహారం- రూ.15/- |



లోకంలో మానవ జన్మలోకి వచ్చాకే కర్మ సిద్ధాంతం ఉంటుంది, మోక్షం పొందే అర్హత కూడా ఉంటుంది.

ఆత్మలు భూమి పైకి వచ్చిన తరువాత ఏడు స్థితుల్లో ఉంటాయి. 1) శైశవాత్మ దశ, 2) బాలాత్మ దశ, 3) యువాత్మ దశ, 4) ప్రౌఢాత్మ దశ, 5) వృద్ధాత్మ దశ, 6) విముక్తాత్మ దశ, 7) పూర్ణాత్మ దశ. ఇవన్నీ అజ్ఞానం నుంచి ఆత్మజ్ఞానం వరకు ఎదుగుదలను సూచిస్తాయి.

ఆత్మజ్ఞానం డబ్బుతో కొనలేరు. సాధన అనే ప్రయత్నంతోనే పొందాలి. సాధన ఉంటేనే ఆత్మజ్ఞానం వస్తుంది. ఆత్మజ్ఞానం వచ్చినప్పుడే వేదన తొలగుతుంది. ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకుంటే ఈ భూమిమీద అజ్ఞానులు, అహంకారులు ఉండరు. అందరూ ఆత్మజ్ఞానులే అవుతారు.

ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పొందిన వాడే మోక్షాన్ని పొందగలడు. మోక్షం అంటే చనిపోయాక వచ్చే స్థితి కాదు. బ్రతికుండగానే ఆనంద స్థితిలో, తృప్తిగా జీవించడం. ఏది ఉన్నా, ఎంత ఉన్నా, ఉన్నా లేకున్నా తృప్తిగా జీవించగలిగితే అదే మోక్షం. ఈ మానవ జన్మ వచ్చినందుకు, భగవంతుని చేరుకునే అవకాశం వచ్చినందుకు మీరు కృతజ్ఞతతో ఉండాలి.

- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.70/-


**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|